Regd: No. H 634 Andhra Janatha Hyderabad 4 పేజీలు: 7 నయా పైసలు

రేపే 7 ప్లాట్లు గొప్ప వేలం అమ్మకం

హెచ్. ఎమ్. సి. వారి అనుమతిని బట్టి, హైదరాబాద్‌లో ఎంప్లాయి మెంటు ఆఫీసువద్ద రాయ్ మురళీధర్ బహదూర్ బంగ్లాకు ఆనుకొని మెయిన్ రోడ్డుపైన ఈ ప్లాట్లు ఉన్నవి. సచివాలయం, కాలేజీలకు చాలా దగ్గర. ఈ ప్లాట్లు రేపు, ఆదివారంనాడు ఉదయం 10 గంటలకు విడివిడిగా వేలం వేయబడును. సవివర కరపత్రాలు మావద్ద లభించగలవు.

దలి బ్రదర్స్, ఆక్షనర్

మొఘంజాహి మార్కెట్ వద్ద, హైదరాబాద్.

(Khan & Sons)

ఆంధ్రజనత

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

Iris Inks for ALL PENS IN FIVE COLOURS

ఐరిస్ సిరాలు

ఫౌంటన్ కలాలకు చాలా మంచివి.

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనం (హైదరాబాద్)లో

మా 420 నెంబరు స్టాలును సందర్శించండి

RECHLAB'S Iris INK

సంపుటి 4 హైదరాబాద్, శనివారం 10-1-1959 సంచిక 188

ప్రజలు కార్యసాధనకు పూనుకొనకపోతే అభివృద్ధి అసాధ్యం

జాతీయ లక్ష్యాలను సాధించటానికి సమైక్యకృషి అవసరమని శ్రీ ఢేబర్ ఉద్బోధ

ఎ. ఐ. సి. సి. మహాసభలో అధ్యక్షోపన్యాసం

ప్రజా స్వామ్యానికి, ప్లానింగ్ కు చుక్కెదురు కాదని ఉద్ఘాటన

అభయంకర్ నగర్, జనవరి 9

కాంగ్రెస్ వాదులు మహాగురుతరమైన కర్తవ్యమును నిర్వర్తించవలసి ఉన్నదనీ, కడు బీదలుగా ఉన్న ప్రజలను ఉన్నత స్థితికి తీసుకొని రావలసి ఉన్నదని కాంగ్రెస్ మహాసభాధ్యక్షులు శ్రీ యు. ఎన్. ఢేబర్ నేడు ఇక్కడ ఉద్బోధించారు.

దేశ ప్రజలు నడుముకట్టి కార్యసాధనకు పూనుకొనక పోయినట్లయితే దేశం అభివృద్ధి కాజాలదనీ, దేశంలో ఏదో ఒక విధమైన అరాజక పరిస్థితి తలెత్తుతుందనీ ఆయన హెచ్చరించారు.

భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ ఈ సమావేశంలో శ్రీ ఢేబర్ అధ్యక్షోపన్యాసమిస్తూ, కాలగతి బహు శీఘ్రంగా ఉండగా, ప్రపంచం శర వేగంతో కదులుతూ పెరుగుతూ ఉండగా మనం కూడా పెరుగవలసి ఉన్నామనీ, ఈ పరిణామదిశవల్ల పోతూర్చి ప్రపంచంలో మనంగూడా అభివృద్ధి కావలసిన ఉద్బోధించారు.

కాంగ్రెస్‌ను, కాంగ్రెస్ ప్రభుత్వాలను విమర్శించేవారు సమస్య యెంత క్లిష్టమైనదో గుర్తించినట్లు తనకు తోచడం లేదని శ్రీ ఢేబర్ అంటూ ప్రసంగించి ఉన్నట్లయితే ఇట్టి విమర్శలు జరుపు చేయరని అన్నారు. "ప్రతి వ్యక్తి జీవితంలోనూ ప్రతిరంగం సహకారం భారత దేశానికి అవసరం. అనుభవమూ, తెలివితేటలు, ప్రతిభ, సామర్థ్యము కల ప్రతి వాడు ప్రజలకు తోడ్పడాలి. వీరులను గోడకానించి, గొంతువరకు యిబ్బందులలోమునిగిఉండి, ప్రజలుజీవితసమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇట్టి వారికి అన్ని వర్గాలవారు, అన్ని రంగాలవారు తోడ్పడవలసి ఉన్నది". అని శ్రీ ఢేబర్ అన్నారు.

(మిగతా 2వ పేజీలో)

రంగూన్‌కు మార్షల్ టిటో రాక

రంగూన్, జనవరి 8

యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో తన ఇండోనీషియా పర్యటనను ముగించుకొని నేడిక్కడకు సతీ సమేతంగా "గాలెఖ్" అనే నౌకలో వచ్చారు.

బర్మాలో మార్షల్ టిటో రెండు రోజులు ఉంటారు.

మార్షల్ టిటో, వచ్చే శనివారం నాడు బైలేరి ఇండియాకు వెడతారు.

న్యూఢిల్లీలో గత 5వ తేదీన జరిగిన అంతర్జాతీయ న్యాయవేత్తల సభలో ప్రధాని నెహ్రూ ప్రారంభోపన్యాసం చేస్తున్న దృశ్యం

2113 సంవత్సరంలో కాస్మిక్ రాకెట్ భూమి ని ఢీకొంటుందా?

మాస్కో, జనవరి 9

సౌర మండలంలో దశమ గ్రహంగా రష్యా ప్రయోగించిన కాస్మిక్ రాకెట్ సిద్ధాంత ప్రకారం 2113 సంవత్సరంలో భూమిని ఢీకొన వలసి ఉంటుంది. ఏ చోట నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించారో అదే చోట ఈ రాకెట్ భూమిని ఢీకొంటుంది. 2113 సంవత్సరం నాటికి రాకెట్ సూర్యుని చుట్టూ 125 ప్రదక్షిణాలు పూర్తి చేస్తుంది. ఈ విషయాలను టాస్ వార్తా సంస్థ నేడు వెల్లడించినది.

కాని రాకెట్‌పై చంద్ర మండలం ఇతర గ్రహాల ప్రభావం కారణంగా రాకెట్ పరిభ్రమణ మార్గం స్వల్పంగా మారి అది భూమితో ఢీకొనే అవకాశం సమాత్రం లేకుండా పోవచ్చుననికూడా టాస్ ప్రకటించినది.

ఢిల్లీలో ఆహారధాన్యాల ధరల పెరుగుదల

పరిస్థితిని ఎదుర్కొనటానికి 200 సరసమైన ధరల దుకాణాలు తెరువబడినట్టు పండిట్ పంత్ వెల్లడి

అభయంకర్ నగర్, జనవరి 9

ఢిల్లీలో ధరల పెరుగుదలను అరికట్టడానికి, ప్రభుత్వం అవసరమైన ప్రమాణంలో ఆహార ధాన్యాలను విడుదల చేసినట్టు కేంద్ర దేశీయాంగ శాఖా మంత్రి పండిట్ గోవింద వల్లభ పంత్ ఢిల్లీనుంచి వచ్చిన కొందరు పార్లమెంటు సభ్యులకు నేడిక్కడ వెల్లడించినట్టు తెలుస్తున్నది.

అమాంతంగా ఆహార ధాన్యాల ధరలు పెరిగిపోవటంవల్ల, ఢిల్లీలో 200 సరసమైనధరల దుకాణాలు తెరువబడినాయని కూడా పండిట్ పంత్ అన్నట్టు ప్రతినిధి వర్గ సభ్యులొకరు తెలుపుతున్నారు.

శ్రీమతి సుచేతాకృపాలినీ, శ్రీమతి యశోదానాయర్‌లతో కూడిన ప్రతినిధి వర్గంప్రధానినెహ్రూ, పండిట్ పంత్, శ్రీ ఎ. పి. జైన్‌లను కలుసుకుని ఢిల్లీలోని ఆహార పరిస్థితిని గురించి వివరించి, ఆ పరిస్థితిని ఎదుర్కొనటానికిసత్వర చర్యలు గైకొనవలసిందిగా కోరినది.

ఆహార పరిస్థితి క్రమక్రమంగా విషమిస్తున్నదని పై పరిస్థితిని ఎదుర్కొనటానికి మేయర్ శ్రీమతి అరుణా అసఫ్ అలీ ఒక అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్నదనీ, సమీప ఢిల్లీనుంచి టెలిగ్రాములువచ్చినట్టు ప్రతినిధివర్గ సభ్యులొకరు అన్నారు. అటువంటి టెలిగ్రాములే ప్రధాని నెహ్రూ, పండిట్ పంత్, శ్రీ జైన్‌లకు కూడా పంపబడినాయి.

కాంగ్రెస్ విషయ నిర్ణయ సభ :-

సహకార సంఘాల ద్వారా మిగులు భూమి సేద్యం

తీవ్ర వాదోప వాదాల అనంతరం తీర్మానం ఆమోదం

అభ్యంకర్ నగర్, జనవరి 9

కాంగ్రెస్ విషయ నిర్ణయసభ నేడు ఉదయం నాలుగున్నర గంటల చర్చ అనంతరం వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన తీర్మానాన్ని ఆమోదించినది.

సంయుక్త సహకారవ్యవసాయాన్ని తొలిమెట్టుగా సర్వీసు సహకార సంఘాలను నెలకొల్పాలని, భూ కమతాలకు గరిష్ఠ పరిమితి నిర్ణయించాలని, మిగులు భూమి పంచాయతుల పరం చేయబడాలని, దాని నిసహకార సంఘాలు నిర్వహించాలని ప్రతిపాదిస్తున్న ఈ తీర్మానం తీవ్ర వాదోపవాదాలకు దారి తీసింది. ఈ తీర్మానంపై జరిగిన చర్చలో సిన్నీ, ఈ రోజున కలిసి మొత్తం 35 మంది సభ్యులు పాల్గొన్నారు. తీర్మానంపై ప్రసంగించిన వారిలో ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ, కేంద్ర అవార్డు మంత్రి శ్రీ ఎ. పి. జైన్, ఉత్తర ప్రదేశ్ రెవెన్యూ మంత్రి శ్రీ చరణ్ సింగ్ ముఖ్యులు. శ్రీ చరణ్ సింగ్ తీర్మానాన్ని వ్యతిరేకించారు.

చర్చకు సమాధానమిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించిన మద్రాసు ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం తీర్మానంలో ప్రతిపాదించబడిన విధానం ఏకీభావమనుకుంటే ప్రస్తుత పరిస్థితులను యథాతథంగా ఉంచటం తప్పించి వేరొక ఆచరణ సాధ్యమైన మార్గం లేదని ఉద్ఘాటించారు. ప్రస్తుతపరిస్థితులు యథాతథంగా ఉండటం ఎవ్వరికీ ఇష్టం కాదు. దానిని ఎవ్వరూ అంగీకరించజాలరు. మార్పులు చేయక తప్పదు. ఈ మార్పులను ప్రజాస్వామిక పద్ధతిలో తీసుకురాకపోతే, అవి అందుకు పూర్తిగా భిన్నమైన పద్ధతిలో రాక మానవని శ్రీ సి. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు.

అయితే, విషయ నిర్ణయ సభ శ్రీ మాధవన్ నాయర్ ప్రతిపాదించిన రెండు సవరణలను ఆమోదించినది. గ్రామ సహకార సంఘాలు నిర్వహించవలసిన బాధ్యతలలో పశుపోషణ, మత్స్య పరిశ్రమాభివృద్ధిని కూడా చేర్చాలని శ్రీ నాయర్ మొదటి సవరణలో ప్రతిపాదించారు. రెండవ సవరణ మిగులు భూములను సేద్యం చేయటానికి ఏర్పాటు చేయబోయే సహకార సంఘాలలో భూమిలేని కూలీలకు, చిన్న రైతులకు మాత్రమే ప్రవేశం ఇవ్వబడుతుందని స్పష్టం చేసినది.

తీర్మానంలో సహకార వ్యవసాయానికి సంబంధించిన [illegible] పూర్తిగా అంగీకారమేనని [illegible] పి. సుబ్బయ్యడు

(మిగతా 1వ పేజీలో)

నగరంలో ఎయిర్ కండిషను కార్లు

హైదరాబాదు, జనవరి 9

విదేశాలనుండి, భారతదేశం ఇతర ప్రాంతాల నుండి నగరానికి వచ్చే విలాస యాత్రికుల కోసం నగరంలో ఎయిర్ కండిషన్ కార్లు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్ పోర్టు కార్పొరేషన్ నిశ్చయించింది. ఈ కార్లలో రేడియో సెట్టు, టాయిలెట్ సౌకర్యం, విమానంలో ఉండేరకంగా సీట్లు నుంటాయి. యాత్రికులభ్యం కాగానే ఈ కార్లు నడుపుతారు.

ఆంగ్లో ఈజిప్షియన్ ఆర్థిక వివాదాలు

యూజిన్ బ్లాక్ ప్రతిపాదనలకు బ్రిటన్ అంగీకారం

కైరో, జనవరి 9

ఆంగ్లో-ఈజిప్షియన్ వివాదాల పరిష్కారానికి తాము అంగీకరించినట్టు బ్రిటన్ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు శ్రీ యూజిన్ బ్లాక్‌కు తెలియజేసినట్టు ఈజిప్షియన్ ఆర్థికమంత్రిత్వ శాఖ నేడు ప్రకటించినది.

సూర్యబింబంలో పెద్ద మచ్చ

లండన్‌లో అగుపిస్తున్నదట

లండన్, జనవరి 8

సూర్యునిలో 1921 తర్వాత మరన్నడూ కన్పడనంత పెద్దమచ్చ ఎరటి నేడిక్కడ స్పష్టంగా కన్పించినది. ఇది జనవరి 17 వ తేదీవరకూ కన్పిస్తూ ఉండగలదని శాస్త్రజ్ఞులు అన్నారు.

వచ్చే జనరల్ ఎన్నికలలో పోలింగ్ కార్యక్రమం

ఐదు రోజులలో ముగించవచ్చునని కమీషనర్ ఆశాభావం

జైపూర్, జనవరి 9

వచ్చే జనరల్ ఎన్నికలలో పోలింగ్ కార్యక్రమం 10 రోజులలో పూర్తి చేయవచ్చునని ఎన్నికల ప్రధాన కమీషనర్ శ్రీ కె. వి. కె. సుందరం నేడు ఆశాభావాన్ని ప్రకటించారు.

ప్రథమ జనరల్ ఎన్నికలలోపోలింగ్ మూడు నెలలపాటు సాగినది. కాని రెండవ ఎన్నికపోలింగ్‌లో19 రోజులలో పూర్తయినది.

మన దేశం చాలా సువిశాలమైన దిగనక, అందుబాటులో ఉన్న అంగబలం స్వల్పంగా ఉన్నది గనక ఒక రోజులో పోలింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయటం అచిర భవిష్యత్తులో సాధ్యం కాదని శ్రీ సుందరం విలేఖరులతో అన్నారు. అయితే కొంత కాలం పోయిన తర్వాత వారం రోజులలో పోలింగ్‌ను పూర్తి చేయటం సాధ్యం కావచ్చు. కమీషనర్ ఇలా చేయటానికి ప్రయత్నిస్తున్నదని ఆయనఅన్నారు.

ఫ్రాన్సుకు నూత్న మంత్రివర్గం

పారిస్, జనవరి 9

నూత్న ఫ్రెంచిప్రధాని ఎమ్. మైకేల్ డేబర్ తమ మంత్రివర్గసభ్యులను అధ్యక్షుడు జనరల్ డిగాల్‌కు రేపు సమర్పిస్తారు.

శ్రీ డేబర్ మంత్రివర్గంలో 21 మంది మంత్రులు, అర్హులు కార్యదర్శులు ఉంటారు. వీరిపేర్లను శ్రీ డేబర్ అధ్యక్షునికి నిన్ననే సమర్పించటం, అయన అంగీకరించటంకూడా జరిగినది.

నాగపూర్‌కు కాశ్మీరు ప్రధాని ఆగమనం

అభయంకర్ నగర్, జనవరి 9

కాంగ్రెస్ సమావేశాలలో పాల్గొనటానికి కాశ్మీరు ప్రధాని శ్రీ బక్షీ గులాం మహమ్మద్ నేడిక్కడకు వచ్చారు.

ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేసే పద్ధతి

వచ్చే జనరల్ ఎన్నికలలో కొన్ని నిర్ణీత నియోజక వర్గాలలో అమలు

జైపూర్, జనవరి 9

ఓటర్లకు ఫోటోలుకల గుర్తింపు పత్రాలను జారీచేసే పద్ధతి వచ్చే జనరల్ ఎన్నికలలో ప్రయోగాత్మకంగా భోపాలు, కలకత్తా పట్టణాలలో రెండేసి నియోజకవర్గాలలో, కాన్పూర్‌లో ఒక నియోజక వర్గంలో ప్రవేశ పెట్టబడగలదని ఎన్నికల ప్రధాన కమిషనర్ శ్రీ కె. వి. కె. సుందరం నేడు విలేఖరులకు చెప్పారు.

ఎప్పటి కప్పుడు మారుతున్న కార్మిక జనాభా కలిసి, జన సమ్మర్ధం అత్యధికంగా ఉన్న కొన్ని నిర్ణీత నియోజక వర్గాలలో ఈ పద్ధతిని ప్రయోగించి చూడాలని అఖిల భారత ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశం నిర్ణయించినదని ఆయన అన్నారు.

గత సమావేశంలో పార్లమెంటు ఆమోదించిన ప్రజాప్రాతినిధ్య (సవరణ) బిల్లు కొన్ని ప్రాంతాలలో దొంగ ఓటర్ల చర్యలను అరికట్టటానికి గాను గుర్తింపు కార్డులను ప్రవేశ పెట్టటానికి వీలు కల్పిస్తున్నది.

హేమర్ షెల్డ్ లిబియా ప్రయాణం

కైరో, జనవరి 8

ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో పర్యటన జరుపుతున్న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి శ్రీ డాగ్ హేమర్ షెల్డ్ ఈ రోజున ఇక్కడినుంచి లిబియా బయల్దేరి వెళ్ళారు.

కైరోలో ఆయన ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు కల్నల్ నాసర్‌తో సంభాషణలు జరిపారు.

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనం,

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం.

హైదరాబాద్ నగరంలో ప్రప్రథమంగా సమర్పించు అంతర్జాతీయ ఖ్యాతివహించిన లిటిల్ బ్యాలెట్ ట్రూప్ బొంబాయివారి బ్రహ్మాండమైన నృత్య నాటకాలు

'రామాయణ'

జనవరి 10 వ తేదీన సాయంత్రం 6-30 గంటలకు

'మహాకవి కాళిదాసు రచించిన మహాకావ్యం

'మేఘదూత్'

జనవరి 11 వ తేదీ సాయంకాలం 6-30 గంటలకు

హైదరాబాద్ ఎగ్జిబిషన్ థియేటరులో

ప్రవేశం రేట్లు: రు. 10, 5, 3, 1.

టిక్కెట్లు దొరుకు స్థలములు: థియేటరు (ఫోన్: 5625)

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘ కార్యాలయం (ఫోన్: 6284)

సంక్రాంతి తగ్గింపు ధరల అమ్మకం

15-1-1959 వరకు మాత్రమే

త్వరపడి ఈ అవకాశాన్ని వినియోగించుకోండి

పట్టుచీరెలు, చేనేత సూలు చీరెలపై తగ్గింపు సూటికి 6 1/4 మొదలు 37 1/2 వరకు

బి. వెంకయ్య

(బెజుగం వెంకయ్య)

కింగ్స్‌వే, సికిందరాబాద్ ఫోన్: 6848

సంక్రాంతికై సరిక్రొత్తగా వచ్చినవి

RAM DRESSES

రామ్ డ్రెసెస్

సుల్తాన్ బజార్, హైదరాబాద్

ఆనందసుధ

శరీర జౌర్బల్యమును పోగొట్టి రక్తశుద్ధిని, రక్తవృద్ధిని చేయు బలవర్ధక ఔషధరాజము.

8 ఔన్సుల సీసా 1 కి రు. 3-00

శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి అండ్ సన్స్ రాజమండ్రి.

విశ్వావసు నామ సంవత్సరం
శనివారం, జనవరి 10, 1959
పుష్య పాడ్యమి
పాడ్యమి ఉ॥ 10-11
ఉ॥ మా॥ 2-6
వర్జ్యం సా॥ 6-7 మొ॥ 7-45 వ॥

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబర్లు
సంపాదక వర్గం: 4308
మేనేజ్‌మెంట్: 4950

శనివారం, జనవరి 10, 1959

కార్పొరేషన్ బడ్జెట్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఆమోదించిన బడ్జెట్ లో కొద్దిగా మిగులు చూపించారు. అయితే, బడ్జెట్ వివరాలను బట్టి చూస్తే,ఆదాయ వ్యయాలను సరిపెట్టడానికి స్థాయీ సంఘం అధ్యక్షుడు కొంత తాపత్రయ పడినట్టు కనిపిస్తున్నది. ఆదాయానికి సంబంధించి ఆయన వివరించిన లెక్కలలో గాలి అంచనాలన దగినవి కొన్ని ఉన్నాయి. మునిసిపల్ కమిషనర్ తయారు చేసిన అంచనాలను స్థాయీ సంఘం సవరించినట్టు ఆయనే అంగీకరించారు. కార్పొరేషన్ ఆదాయం 1,14,19,284 రూపాయల వరకు ఉంటుందని, ఖర్చు 1,15,14,301 రూపాయల వరకు ఉంటుందని, మొత్తం మీద బడ్జెట్ లో 95,017 లోటు తేలుతుందని కమిషనర్ అంచనా వేసారు. ఎందు చేతనో కాని, స్థాయీ సంఘానికి బడ్జెట్‌లో లోటుచూపించటం ఇష్టం లేదు. 1959-60 తర్వాత గ్రాంటు ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, గ్రాంటు మొత్తం 10,28,500 రూపాయలను స్థాయీ సంఘం ఆదాయానికి సంబంధించిన అంచనాలలో చేర్చినది. ఇంతేగాక, ప్రస్తుత సంవత్సరంలో మొదటి ఆరు నెలల ఆదాయానికి సంబంధించిన లెక్కలను బట్టి వచ్చే సంవత్సరం ఆదాయాన్ని అంచనా వేయటం జరిగింది. ప్రభుత్వ గ్రాంటును ఆదాయంలో చేర్చటానికి కారణ మేమిటో వివరిస్తూ ప్రభుత్వం వద్దకు ఒక రాయబార వర్గాన్ని పంపదలచామనీ, ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంటుందని ఆశిస్తున్నామనీ స్థాయీ సంఘం అధ్యక్షుడు పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రాంటు విషయంలో నిర్ణయాన్ని మార్చుకుంటే సంతోషమే. కాని, బడ్జెటింగ్ అంటే అంకెల గారడీ కాదన్న విషయాన్ని స్థాయీ సంఘం సభ్యులు గమనించటం అవసరం. అదృష్టం మీద ఆధారపడటం మరీ ప్రమాదకరమని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. బడ్జెట్ లో లోటు తేలితే దానిని భర్తీ చేసుకొనటానికి మార్గాలను అన్వేషించాలి కాని, ఆధారంలేని అంచనాలతో సంతృప్తి పడటం శ్రేయస్కరం కాదు.

ఈ సంవత్సరం కార్పొరేషన్ అమలు పరచిన పన్నుల ప్రతిపాదనలపై పెద్ద దుమారం లేచినది కాబట్టి వచ్చే సంవత్సరం కొత్త పన్నులను ప్రతిపాదించక పోవటంలో ఆశ్చర్యం లేదు. నిధానికి అదనపు పన్నుల ద్వారా అధికాదాయాన్ని రాబట్టడానికి ఇప్పుడు వాతావరణం అనుకూలంగా లేదు. ఆదాయాభివృద్ధికి గాను కార్పొరేషన్ కేవలం పన్నుల మీద, గ్రాంటుల మీద ఆధారపడటం శ్రేయస్కరం కాదు కూడా. ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సామాన్య ప్రజలపై భారంగా పరిణమించని ఆదాయాభివృద్ధి మార్గాలను అన్వేషించటం ఎక్కువ ప్రయోజనకరంగా కాగలదు. ఇటు ప్రజలకు ఉపయోగకరం, అటు కార్పొరేషన్‌కు లాభదాయకం అయిన సూక్ష్మ మార్గాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు, మార్కెట్ల నిర్మాణం, నివాస గృహాల నిర్మాణం, బస్సు సర్వీసుల నిర్వహణ మున్నగు చర్యల ద్వారా కార్పొరేషన్ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకొనటానికి శాశ్వత ఏర్పాట్లు చేసుకొనటానికి ఎంతైనా అవకాశం ఉన్నది. అయితే, ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం కార్పొరేషన్ తో సహకరించటం అవసరం. బస్సు సర్వీసులు మున్నగు వాటిని ప్రభుత్వమే నిర్వహించటం వల్ల కార్పొరేషన్లు, మునిసిపల్ కమిటీలు తమ ఆదాయాలను వృద్ధి చేసుకోలేక పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ గుత్తాధికారాన్ని తగ్గించుకోక పోతే, స్థానిక సంస్థలు వాటి బాధ్యతలను సక్రమంగా నిర్వహించ జాలవు.

సైనిక కూటాలకు దూరంగా ఉండే విధానం
యుగోస్లావియా వైఖరి, ఇండియా వైఖరి ఒకటేనని స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 8

యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో భారతదేశంలో జరుపనున్న పర్యటనకు రాజకీయ ప్రాముఖ్య మేమీ లేనప్పటికీ ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రధాని శ్రీ నెహ్రూ మార్షల్ టిటోతో ప్రపంచ సమస్యలను చర్చించ వచ్చునని భారత దేశంలో యుగోస్లావియా రాయబారి దూసాన్ క్వెదార్ ఈ రోజున ఇక్కడ అన్నారు.

క్వెదార్ నేడు పత్రికాప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా ప్రసంగిస్తూ ఇండియా, యుగోస్లావియాలు ప్రపంచంలోని రెండు సైనికకూటాలలో దేనిలోనూ చేరకుండాఉండే ఒకేవిధానాన్ని అనుసరిస్తూ ఉన్నవనిఅన్నారు. "ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో ఈరెండు సైనిక కూటాలలో ఏదోఒకదానిలో చేరేపద్ధతిని అవలంబించినట్లయితే బహుత్వరలో యుద్ధంవస్తుందనీ, ఈయుద్ధం మూలకంగా ఈరెండు రాజకీయ వ్యవస్థలు తుడిచిపెట్టుకుని పోతవనీ యుగోస్లావియా భావిస్తున్నది. ఈరోజులలో యుద్ధంవస్తే మానవకోటి నాశనమైపోతుంది. యుద్ధాన్ని నివారించడానికి ఒకే ఒకమార్గంఉన్నది. సుహృద్భావ వాతావరణం కల్పించడం వల్ల రాజీ పద్ధతిలో వివిధ సమస్యలకు పరిష్కారం కనుగొనడంవల్ల మాత్రమే యుద్ధాన్ని వారించగలుగుతాము. ఇట్టి సుహృద్భావ వాతావరణం కల్పించడానికి ప్రయత్నించే వారికి శాంతియుతంగా ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో పట్టుదల చూపే వారికి యుగోస్లావియాతోడ్పడుతుంది. తాంత్రిక యుద్ధంలో తగుల్కొని ఉన్న ఏ సైనిక కూటమిలోనూ యుగోస్లావియా చేరి ఉండలేదు. ఏ కూటమిలోనూ చేరడం మాకు ఎంతమాత్రమూ ఇష్టం లేదు. ఏ కూటమిలోనైనా చేరినట్లయితే అనేక సమస్యలు ఉత్పన్నమౌతవి. ప్రపంచ శాంతికి భంగం కలుగుతుంది" అని రాయబారి అన్నారు.

మూడవ కూటమి స్థాపనోద్దేశాన్ని గూర్చి గూడా రాయబారి వర్ణించారు. "ప్రపంచంలో అన్ని దేశాలతోనూ యుగోస్లావియా అతి మిత్రభావాన మెలగగోరుతున్నది. గ్రీస్, నార్వే, బెల్జియమ్, డెన్మార్క్ మొదలైన అనేక దేశాలతో యుగోస్లావియా మిత్రసంబంధాలు యేర్పరచుకొన్నది. కొన్నిసమస్యలపై యుగోస్లావియా, బ్రిటన్లమధ్య కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నప్పటికి ఉభయదేశాల సంబంధాలు మిత్రభావ పూరితమైనవిగానే ఉన్నాయి. మేము ఇట్టివైఖరి అవలంబిస్తూ ఉండడంవల్ల మార్క్సిస్టు ప్రధాన సిద్ధాంతాలకు మారమైపోతున్నామని భావించ గూడదు. "యుగోస్లావియా మార్క్సిస్టుమ్ ను అవలంబిస్తున్నప్పటి స్వతంత్రమైన అంతరంగిక విధానాన్ని, అంతర్జాతీయ విధానాన్ని అది అవలంబించవచ్చు మార్క్సు సిద్ధాంతాలను ఆచరణలో పెట్టని దేశాలతో మేము సంబంధాలు పెట్టుకోవలసిన అవసరం లేదు. ఉభయ సైనిక కూటాలతో ఆర్థిక, రాజకీయ సంబంధాలు కల్పించుకునే విషయంలో ఇండియా, యుగోస్లావియాల వైఖరి ఒకే విధంగా ఉన్నది. ప్రపంచంలో శాంతి స్థాపన జరగాలంటే జర్మనీ సమస్య, మధ్యప్రాచ్య సమస్య, పాలస్తీనా సమస్య, ఆఫ్రికా సమస్య పరిష్కారం కావాలి. ఈ సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించి, ప్రపంచ శాంతికి భంగం కలిగే అవకాశాన్ని నివారించడానికి చర్యలు తీసుకునేవారందరికి మేము తోడ్పడతాము" అని భారతదేశంలో యుగోస్లావియా రాయబారి క్వెదార్ అన్నారు.

పోట్‌పల్లిలో చిరుత పులుల బెడద
నాలుగు నెలల శిశువుకు ప్రాణాపాయం

హైదరాబాదు, జనవరి 8

జహీరాబాద్ తాలూకా పోట్‌పల్లి గ్రామంలో ఒక చిరుతపులి పట్టపగలు 4 నెలల ఆడ శిశువును చంపివేసింది.

ఈ శిశువు తల్లి చాంద్ బీ శిశువును ఒక చెట్టునీడను ఉంచి పొలంలో ఏదో పని చేసుకుంటూ ఉన్నది. చంటి బిడ్డ ఏడుపును తల్లిపని వెదుకకు తిరిగి చూచేటప్పటికి ఆ క్రూర ఘాతుక మృగం చంటి పిల్లను తన నోటిలో కరుచుకొని ఉన్నది. ఆమె కేకలు పెట్టగా గ్రామస్థులుఅక్కడికి పరుగు పరుగునవచ్చారు చిరుతపులి శిశువు శవాన్ని అక్కడ వదలివేసి అడివిలోకి పారిపోయింది. చిరుతపులిని పట్టుకొని చంపడానికి పరిసర అరణ్యాలలో వెదుకుతున్నారు.

వేరుసెనగపిండి ఎగుమతికి ప్రత్యేక లైసెన్సులు

న్యూఢిల్లీ, జనవరి 8

భారత ప్రభుత్వం వేరుసెనగ నూనె ఎగుమతి పరిస్థితిని సమీక్షించి, ఎగుమతుల పెంపుదల చర్యగా, వేరుసెనగపిండి ఎగుమతికి రంగంలోని ఎగుమతి వ్యాపారులకు ప్రత్యేక లైసెన్సు లివ్వడానికి నిర్ణయించినదని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలియజేసింది. అయితే వ్యాపారులు యిప్పటి నుంచీ 1959 ఫిబ్రవరి ఆఖరు వరకూ ఎగుమతిచేసే వేరుసెనగనూనె మొత్తానికి సమానమైన వేరుసెనగ పిండిని ఎగుమతికి అనుమతిస్తారని కూడా ఆప్రకటన తెలుపుతున్నది.

వేరుసెనగపిండి ఎగుమతికి ప్రత్యేక లైసెన్సులు, వేరుసెగనూనెను ఎగుమతి చేసినట్టు దాఖలా పత్రాలను చూపిన మీదటే మంజూరవుతాయనీ, వేరుసెనగ నూనెను ఎగుమతి చేసిన ప్రతి తడవా యీ లైసెన్సులకు విడివిడిగా దరఖాస్తులుపెట్టు కోవచ్చునని కూడా ఆ ప్రకటనలో వెల్లడించారు.

1958 అక్టోబరులో నిరాశ్రయులకు ఉద్యోగ సౌకర్యాలు

న్యూఢిల్లీ, జనవరి 8

1958 అక్టోబరు నెలలో ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి కార్యాలయాలలో 8,347 మంది నిరాశ్రయులు తమ పేర్లను రిజిస్టరు చేసుకుంటే, వారిలో 486 మందికి ఉద్యోగాలు దొరికాయి. అంతకు ముందు నెలలో 4031 మంది తమ పేర్లను రిజిస్టరు చేసుకున్నారు. 518 మందికి ఉద్యోగాలు లభించాయి. అక్టోబర్ నెలలో ఉద్యోగాలు పొందిన వారిలో 310 మంది తూర్పు పాకిస్తాన్ నుంచీ, 176 మంది పశ్చిమ పాకిస్తాన్ నుంచీ వచ్చినవారు.

అక్టోబరు నెలాఖరుకు, ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజీల వద్దవున్న నిరుద్యోగుల జాబితాలో 45,169 మంది నిరాశ్రయుల పేర్లు వున్నాయి. అంతకు ముందు నెలాఖరునాటికి 44,560 మంది నిరాశ్రయుల పేర్లు వున్నాయి.

ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటీ

హైదరాబాద్, జనవరి 9

శ్రీ మహాబీర్ త్యాగి అధ్యక్షతన పార్లమెంట్ నియమించిన ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటీ ఈ నెల 12,13 తేదీలలో నగరంలోని జూబిలీ హాల్‌లో సమావేశాలు జరుపుతుంది.

శ్రీ ఢేబర్ అధ్యక్షోపన్యాసం

(1వ పేజీ తరువాయి)

ప్రయివేటురంగం సుహృద్భావంతో సహకరించాలని కోరుతూ శ్రీ ఢేబర్ ఇలా అన్నారు: "భారత జాతీయ కాంగ్రెస్ యెవ్వరికీ వారి కలిగించడం కోరడం లేదు. పారిశ్రామిక రంగానికి దేశభక్తి లేదని గాని, ప్రజలపై ప్రేమ లేదని గాని మేము అనడం లేదు. దేశ ప్రజల జీవిత చిత్రం కాంగ్రెస్ మనోఫలకంలో వాస్తుకొని పోయింది. ప్రజల జీవితంలో పాల్గొని, ప్రతి వారి సహాయంతోనూ ఈ జీవిత పరిస్థితులను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ వాంఛిస్తున్నది. దేశ ప్రజలను ఉన్నత స్థితికి తీసుకొని రావాలని కాంగ్రెస్ వాంఛిస్తున్నది. దేశ ప్రజలను ఉన్నత స్థితికి తీసుకొని రావడానికి ప్రయివేటు పారిశ్రామికుల తోడ్పాటు అవసరం. ఒక వైపున జాతీయకరణకు, మరొకవైపున ప్రయివేటు రంగం ఉనికికి వ్యతిరేకంగా గొంగ్లోలుపెట్టే ఉద్యమం నశిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ప్రజాస్వామ్యమూ, ప్లానింగూపరస్పరవిరుద్ధములనేవాదము, ప్రయివేటురంగమూ, సోషలిస్టువ్యవస్థా పరస్పర విరుద్ధములనేవాదము మనలను కలవరపరచడం లేదు. భారతదేశంలో ఉన్నది ఒకే ఒక ఆర్థికవ్యవస్థ.ప్రయివేటు వ్యక్తుల ద్రవ్య సహాయంకలవ్యవస్థఐనా, ప్రభుత్వద్రవ్య సహాయం కలవ్యవస్థఐనా దేశంలో ఉన్నవ్యవస్థ ఒకటే అదేక్రమబద్ధమైన జాతీయ వ్యవస్థ"అని ఆయన అన్నారు.

త్వరలో కాంగ్రెస్ అధ్యక్షపదవి నుండి విరమించ బోతున్న శ్రీ ఢేబర్ తమ 12వేలమాటల ఉపన్యాసంలో దేశ వ్యవహారాలను, ప్రపంచ పరిస్థితులను సమీక్షించారు. భారతదేశం ఎదుర్కొంటున్న బ్రహ్మాండమైన సమస్యలను గూర్చి వారు దీర్ఘంగా ప్రస్తావించి, ఈ సమస్యలను పరిష్కరించడానికి తీసుకొనవలసిన చర్యలను సూచించారు.

వ్యవసాయోత్పత్తి హెచ్చింపు

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో మిగిలిఉన్న రెండు సంవత్సరాల కార్యక్రమాన్ని గూర్చి శ్రీ ఢేబర్ వివరిస్తూ వ్యవసాయోత్పత్తిని హెచ్చించడం వల్లనూ, పొదుపు ఉద్యమ లక్ష్యాలను అందుకోడం వల్లనూ, వికేంద్రీకృత రంగంలో ఉత్పత్తి వల్లనూ దేశ ఆర్థిక వ్యవస్థకు పౌన్నత్యం చేకూర్చాలనిఉద్బోధించారు. "ఇంకా రెండేళ్ళుమిగిలిఉన్నవి. ఇప్పటి నుంచీ మనం కష్టపడి పనిచేసినట్లయితే చాలా అభివృద్ధిని సాధించగలము" అని శ్రీ ఢేబర్ అన్నారు. "ఇప్పుడు మనం చేసే తీవ్రకృషి పైననే తృతీయ పంచవర్ష ప్రణాళిక, అటు తరువాత మనం తయారు చేసే ప్రణాళికలు ఆధారపడిఉంటవి"అని ఆయనఅన్నారు

ప్రజా స్వామ్యానికి 1958 బహుగడ్డు సంవత్సరమని శ్రీ ఢేబర్ వర్ణించారు. ఈ సంవత్సరం అనేక దేశాలు సైనిక పాలన క్రిందికి వెళ్ళినవి. దీని నుండి భారత దేశం నేర్చుకోవలసింది ఎంతైనా ఉన్నది. "ఇతర విధానాల వలె ప్రజా స్వామ్యం కూడా తన యంత్రాంగం మూలకంగా ప్రజల సమస్యలను పరిష్కరించగలదనీ, ఇలా పరిష్కరించ గలగడం మాత్రమేగాక మానవ స్వాతంత్ర్యాన్ని, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని రక్షించగలదనీ ఋజువు చేసే కర్తవ్యం భారత దేశంలోని ప్రజాస్వామ్యంపై ఉన్నది. దీన్ని సాధించాలంటే దేశం బాగా రక్షించబడాలి. దేశంలో శాంతి భద్రతలు ఉండాలి. ఆర్థిక స్థిరత్వం ఉండాలి. సాంఘికంగాను, ఆర్థికంగాను, సాంస్కృతికంగాను దినదిన ప్రవర్ధమానమౌతున్న సంఘంలో అందరికీ సమానమైన ప్రతిపత్తి ఉంటుందనీ, అందరికీ సమానావకాశాలు ఉంటుందనీ హామీ యివ్వాలి" అని శ్రీ ఢేబర్ అన్నారు.

అంతర్జాతీయ సమస్యలు

శ్రీ ఢేబర్ అంతర్జాతీయ పరిస్థితులను గూర్చి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "నిన్నటివరకు మిత్రులుగా ఉండినవారు ఇప్పుడు వైరులైనారు. బెర్లిన్ సమస్య కొరియా, ఇండో-చైనా, ఆఫ్రికాయా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నవి. ఈ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నంత వరకు ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ సన్నాహాలు అంతం కాజాలవు. కాశ్మీర్ సమస్యకు మూల కారణం పాకిస్తాన్, ఇండియాల దృక్పథాలలో గల వ్యత్యాసమే. కాశ్మీర్ పై పాకిస్తాన్ దండయాత్ర చేసేటంత వరకు భారత ప్రభుత్వం కాశ్మీర్ వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోలేదు.

కాశ్మీర్ పాలకుడు భారత దేశంలో చేరడానికి నిశ్చయించాడు. కాశ్మీర్ జాతీయ మహాసభ అతనికి అండగా ఉండినది. భారత ప్రజలు, కాశ్మీరు ప్రజలు అవలంబించినవైఖరి శతృత్వంవల్లగాని, దురాశవల్లగాని ఉత్పన్నమైనది కాదు ప్రపంచ చరిత్ర నేర్పుతున్న గుణపాఠాలలో అచంచలమైన విశ్వాసమే ఈ వైఖరి అవలంబించడానికి కారణం. కాశ్మీర్ ముస్లిములు భారత దేశంలో స్వేచ్ఛగా జీవించలేరనే వాదం జాతీయ భావానికిగాని, వాస్తవిక పరిస్థితులకు గాని, అనుగుణమైనది కాదు. పాకిస్తాన్ తరువాత భారత దేశంలో మరెక్కడా లేనంత మంది ముస్లిములు ఉన్నారు. ఒక మతం వారు విడిగా ఉండాలనే భావాన్ని పాకిస్తాన్ విస్తరించవలసి ఉన్నది. ఒకానొక మతం వారు ఏకాంతంగా ఉండ వీలు లేదనే విషయాన్ని ఇండియా గ్రహించింది. అరబ్బీ దేశాలు గ్రహించాయి. ఆఫ్రికా ఖండమంతా గ్రహించింది. పాకిస్తాన్ తీసుకున్న చర్యల వల్ల ఇదివరకు కలిగిన ఫలితాలే కలుగుతవని, మరెట్టి ఫలితాలూ కలుగవనీ పాకిస్తాన్ గ్రహించవలసి ఉన్నది. మత వైషమ్యంతో కూడిన రాజకీయాలకు దోహదమివ్వడానికి విదేశీయ సామ్రాజ్య తత్వవాదులు యిప్పుడు లేరనే విషయాన్ని పాకిస్తాన్ మరచిపోయింది. పాకిస్తాన్ కేవలము కాశ్మీర్ సరిహద్దులను అతిక్రమించడం మాత్రమేగాక చరిత్ర నేర్పిన గుణపాఠాలను గూడా అతిక్రమిస్తున్నది. అస్వతంత్ర ప్రజలు జాతీయత అనే పతాక క్రింద చేరి స్వతంత్రులు కాగోరుతున్నారని చరిత్ర నేర్పిన గుణపాఠానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ చేస్తున్నది."

శ్రీ ఢేబర్ సరిహద్దు సమస్య విషయమై ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "నెహ్రూ-నూన్ ఒప్పందంమూలకంగా తక్కిన సరిహద్దు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి త్రోవచక్కజేయబడుతుందని ఆశించాము కాని ఆశ అడియాసఐంది. తూర్పుసరిహద్దునమనకు బాగా పనికల్పించే ఉద్దేశ్యం పాకిస్తాన్‌కు ఉన్నట్లు కనిపిస్తున్నది. దౌర్జన్యం వల్ల ఏ సమస్యలూ పరిష్కారం కావని 40 సంవత్సరాల చరిత్ర చాటుతున్నది. భారత దేశం ప్రదర్శిస్తున్న సుహృద్భావానికి బదులుగా పాకిస్తాన్ గూడా సుహృద్భావం ప్రదర్శిస్తుందని ఆశిస్తున్నాము, ఈ పదేళ్లలో భారత దేశం ప్రపంచంలో గౌరవ స్థానాన్ని సాధించింది. పంచశీలను భారతదేశం అవలంబిస్తూ సరిహద్దును చక్కగా రక్షించుకోగలిగింది. సంస్థానాల ఏకీకరణ సమస్యను, శరణార్థుల సముద్ధరణ సమస్యను, జమీందారీలను ఎస్టేట్లను రద్దుచేసే సమస్యను బహుస్వల్ప కాలంలో భారత దేశం జయప్రదంగా పరిష్కరించింది. ప్రపంచ మార్కెట్లలో తన ఆర్థిక పరపతిని రక్షించుకోగలిగినందుకు భారతదేశం సంతృప్తి పొందవచ్చు అభివృద్ధి చెందే వ్యవస్థలో ఎన్ని ఒత్తిడిలుఉన్నా ఆర్థిక స్థిరత్వానికి భారత దేశం ప్రసిద్ధికాంచింది. ఇందుకు భారత దేశం సంతృప్తి పొందవచ్చు" అని శ్రీ ఢేబర్ అన్నారు.

పంచవర్ష ప్రణాళికలు

భారత దేశాన్ని సుఖవంతమూ, సౌభాగ్యవంతము చేయడానికి 'మనం సాగిస్తున్న యాత్రలో పంచవర్ష ప్రణాళికలు మైలు రాళ్ళని శ్రీ ఢేబర్ అన్నారు. ద్వితీయ ప్రణాళికలో వ్యవసాయక లక్ష్యాలను అందుకోవడం అత్యవసరమని ఉద్ఘాటించారు. "మన పథకానికి వ్యవసాయమే ప్రాతిపదిక పునాది. ఈ పునాది, ఈ ప్రాతిపదిక బలహీనంగా ఉన్నట్లయితే, అసలుటుగా ఉన్నట్లయితే దానిపై సుస్థిరమైన భవనం నిర్మించడానికి వీలులేదు" అని శ్రీ ఢేబర్ అన్నారు.

వ్యవసాయక లక్ష్యాలను మనం అందుకోజాలక పోయినందుకు వరదలు, క్షామము, ద్వితీయ ప్రణాళికలో వ్యవసాయానికి ప్రాముఖ్యం తగ్గించడమూ, మొదటి పథకం జయప్రదమైన తరువాత ఆశాభావం వల్ల కృషి సడలించడమూ కారణాలని అధ్యక్షులు అన్నారు. "నే నెవరినీ తప్పు బట్టడం లేదు. ప్రాముఖ్యం కొద్దిగా తగ్గిస్తే అనర్థం కలుగుతుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాను."

దేశప్రజల జీవిత పరిస్థితిని శ్రీ ఢేబర్ ఈ క్రింది విధంగా వర్ణించి, అందరి సహాయంతో ఈ పరిస్థితిని అభివృద్ధి చేయాలనీ, క్రిందివారిని ఉన్నత స్థితికి తీసుకొని రావాలని కాంగ్రెస్ వాంఛిస్తున్నదని అన్నారు.

తృతీయ ప్రణాళిక ప్రారంభమైనప్పుడు దేశ జనాభా 42 కోట్లుగా ఉంటుంది దీనిలో 34కోట్లు గ్రామసీమలలోనూ, 8 కోట్లు పట్టణ ప్రాంతాలలోనూ ఉంటారు.

గ్రామ ప్రాంతాలలో జనాభా రెండు శాతం చొప్పునా, పట్టణ ప్రాంతాలలో 4.6 శాతం చొప్పునా హెచ్చుతుంది. అనగా తృతీయ ప్రణాళిక కాలంలో గ్రామ ప్రాంతాలలో జనాభా 3 1/2 కోట్లు, పట్టణ ప్రాంతాలలో 1 1/2 కోట్లు పెరుగుతుందన్న మాట.

ద్వితీయ ప్రణాళిక అంతమయ్యేసమయాన 50 లక్షలపైగా నిరుద్యోగులుగా ఉంటారు. తృతీయ ప్రణాళిక కాలంలో మనం 1.75 కోట్ల కార్మికులకు పనులు చూపవలసి ఉంటుంది.

దేశంలోని పాటకపు జనంలో 70 శాతం వ్యవసాయము మొదలైన వృత్తులలో ఉన్నారు. వీరిలో 15.2 శాతం భూమిలేని వ్యవసాయ కూలీలు, వీరికి ఉన్న భూమి బహు స్వల్పమవడం వల్ల వారిని వ్యవసాయ కూలీల క్రింద చేరుస్తున్నాను. సంవత్సరానికి వీరి సగటు ఆదాయం రూ. 109. తలకు ఒకటికి పారిశ్రామిక కార్మికుల సగటు ఆదాయం 265. ఈకాలంలో దేశంలో తలల ఒకటికి, సగటు ఆదాయం రూపాయి1 ఈ కూలీలు దుర్భర దురవస్థలో ఉన్నారు. సాగు చేయదగిన యెత్తైన భూమిలో వారి భూమి 1 శాతం కంటే యెక్కువగా ఉండదు. ఈ ప్రజల ఆర్థిక స్థితి చాలా హీనంగా ఉన్నది. ఈ కూలీలలో 26.4 శాతం సంవత్సరానికి 100 రూపాయల చొప్పున భోజనానికి ఖర్చు చేస్తున్నారు. 38 శాతం 150 రూపాయల చొప్పున ఖర్చు చేస్తున్నారు. వీరి స్థితి ఎలాగున్నదో ఊహించుకోవచ్చు.

ప్రజలకు పనులు చూపే ప్రశ్నకు తోడు వారి ఆహారావసరాలు తీర్చే సమస్య, విద్య చెప్పే సమస్య, ఆరోగ్య, పారిశుద్ధ్య సమస్య: గృహ నిర్మాణ సమస్య మనం పరిష్కరించ వలసి ఉన్నది. దేశంలోని 5 కోట్ల మంది పిల్లలలో 2 1/2 కోట్ల మంది పాఠశాలలకు వెడుతున్నారు. వచ్చే 7 సంవత్సరాలలో పిల్లల సంఖ్య 2 1/2 కోట్లు పెరుగుతుంది. వీరందరికీ చదువు చెప్పడానికి యేర్పాట్లు చేయవలసి ఉన్నది. 50వేల గ్రామాలలో ప్రజలకు మంచినీటి సౌకర్యాలు కల్పించవలసి ఉన్నది. గ్రామ ప్రజలకు, గ్రామ పరిసర ప్రాంత ప్రజల పారిశుద్ధ్యానికి అత్యవసరమైన యేర్పాట్లు చేయవలసి ఉన్నది. పట్టణ ప్రాంతాలలో అదనంగా 30 లక్షల మందికీ, గ్రామప్రాంతాలలో60లక్షలమందికీ ఇళ్లు కట్టించవలసి ఉన్నది. ఈ సమస్య ఎంత బ్రహ్మాండమైనదో ఈ లెక్కల వల్ల స్పష్టం కాగలదు ఇదంతా క్రింది స్థాయిలో నున్న ప్రజలను ఉన్నత స్థాయికి తీసుకొని పోవడమేగాని ఉన్నత స్థాయిలో ఉన్నవారిని క్రింది స్థాయికి తీసుకొని పోవడం కాదు. ఆదాయంలోను, సౌభాగ్యంలోనూ కల వ్యత్యాసాలను తొలగించడానికి మార్గం కొంత డబ్బు కలవారిని డబ్బు లేని వారుగా చేయడం కాదనేవాదం మనకు సమ్మతమైనట్లే జీవితంలో క్రింది స్థాయిలోఉన్న వారిని పై స్థాయికి తీసుకొని పోవడానికి ప్రయివేటు రంగం కొంత త్యాగం చేయవలసి ఉంటుందనే విషయం ప్రయివేటు పారిశ్రామికులకు సమ్మతంగా ఉంటుందని విశ్వసిస్తున్నాను.

ఈ కర్తవ్యాలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విధి స్పష్టమే మనశక్తి సామర్థ్యాలు తీవ్రంగా పరీక్షించ బడతవి. కాంగ్రెస్ తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలంటే కాంగ్రెస్‌లోని వారు సంకుచిత మనస్తత్వాలను, ద్వేషాలను అధిగమించి కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి. మహత్తరమైన కృషి చేయడానికి, త్యాగం చేయడానికి కాంగ్రెస్ సిద్ధం కావాలి. అప్పుడే మనం ప్రజలకు ఉత్సాహం కలిగించ గలుగుతాము రెండు మార్గాలలో ఏదో ఒక మార్గాన్ని మనం ఎంచుకోవాలి. సోషలిజము, వర్గ తత్వమూ యెన్నడూ సైదోడుగా ఉండజాలవు సోషలిజము బహు విస్తృతమైనది. రెండవది బహు సంకుచిత మైనది. జన సామాన్యము యొక్క క్షేమ లాభాలకు వ్యతిరేకమైన పనులు మనమేమీ చేయగూడదు. మన చర్యలు జనసామాన్యము యొక్క క్షేమ లాభాలకు విరుద్ధమైనవే ఐనట్లయితే, ప్రజల క్షేమ లాభాలపట్ల ఉదాసీన భావాన్ని కలిగించేవైనట్లయితే మన లక్ష్యం సోషలిజమని చెప్ప వీలులేదు.

తృతీయ ప్రణాళిక

తృతీయ ప్రణాళిక బ్రహ్మాండమైనదిగా ఉండవచ్చునని అధ్యక్షుడు అంటూ దేశ ఆంతరంగిక సాధన సంపత్తి నంతటిని వృద్ధి చేయడమూ, సమీకరించడమూ, మన ప్రధానోద్దేశ్యంగా ఉండాలని ఉద్బోధించారు. "పంచవర్ష ప్రణాళికకు యింకా ఎక్కువ ద్రవ్యం సేకరించాల్సి ఉంటుందనడానికి ఎట్టి సందేహమూ లేదు. ఐనప్పటికీ ఈ ద్రవ్యాన్ని మనం సేకరించక తప్పదు మనం జీవించి ఉండాలంటే ఈ ద్రవ్యాన్ని సేకరించడం కంటే వేరేమార్గం లేదు" అనిఅధ్యక్షుడు అన్నారు.

దేశ సాధన సంపత్తిని వృద్ధి చేయడానికి, సమీకరించడానికి ఆయన ఈ క్రింది మార్గాలు సూచించారు. అసంపూర్తిగా ఉన్న మన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడం, పారిశ్రామిక శక్తి సంపతినిపూర్తిగాఉపయోగించుకోవడం ఎక్కువగా ఉత్పత్తి చేసే శక్తి ఉన్నప్పటికీ ఆ శక్తిని ఇప్పుడు వినియోగించుకోడంలేదు. ఆ శక్తిని గూడా మనం పూర్తిగావినియోగించుకోవాలి.(1)అంగబలము మొదలైన శక్తులను పూర్తిగా వినియోగించు కోవడము, (2) ఉత్పత్తికి ప్రమాణాలు నిర్ణయించడం. ఆ ప్రమాణాన్ని మించిఉత్పత్తి చేసినవారికి బహుమానాలివ్వడం. (3) ఆహార ధాన్యాల ధరలను, బట్టల ధరలను, ఉత్పత్తికి కావలసిన వస్తువుల ధరలను క్రమ బద్ధం చేయడం. ఇలా చేసేటప్పుడు ఉత్పత్తి దారుకు తగిన ప్రతిఫలం ఉండేటట్లు చూడాలి. (4) దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలోనూ జీతాల వ్యవస్థను, కూలి వ్యవస్థను, లాభాల వ్యవస్థను ఇంకా ఎక్కువ శ్రద్ధగా పరిశీలించవలసి ఉంటుంది. (5) వీటితో పాటు మిగులు ఎక్కడ ఉన్నదో కనిపెట్టి, దాన్ని సమీకరించడానికి మార్గాలు, పద్ధతులు కనిపెట్టడం.

కాంగ్రెస్ వ్యవహారాలు ఆదర్శప్రాయమైన స్థితిలో లేవు. కాంగ్రెస్‌ను ఇంకా ఎక్కువ పటిష్టం చేయవలసి ఉన్నది. కాంగ్రెస్‌లోని వారందరు ఒక కుటుంబంలోని వారి వలె అనుకూలభావంతో వ్యవహరించేటట్లు చేయాలి. కాంగ్రెస్‌కు కలుగుతున్న కష్టాలకు మనమే క

సుఖాంత చలన చిత్రము

దగ్గు తక్షణం ఆగిపోయింది

నా దగ్గు చాలా ఎక్కువైంది. మరణించేద నుకొన్నాను. పరిష్కారం కనిపించాను. గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్స్ పెట్టాకోసం నా మిత్రుల వ్యాపారి వద్దకు వెళ్లాను. ఈ రుచిగల పెప్స్ బిళ్లలను దప్పరించి చూడగా, నా దగ్గు మాయమై పోయింది. 24 గంటలలో అందరి శరీరనగర అనిపించు క్రిములన్నిటిని ధ్వంస పర్చినవి. ఇప్పుడు నేను గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్స్‌ను ఎల్లప్పుడూ దగ్గిరుంచుకుంటున్నాను

పెప్స్

గొంతు మరియు గుండె బిళ్లలు దగ్గుకు, రొమ్ము పడిశెమును, గొంతు నొప్పులు, జలుబులకు. మందుల వ్యాపారులందరి వద్దను దొరకును.

ఎ. జి. ఫ్రిల్‌పోర్ట్ (ఇండియా) ప్రైవేట్ లి.,

సోల్ ఏజంట్లు: దాదా అండ్ కో, 86, నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు-3.

4 వ దిగ్విజయ సంయుక్తవారం!

నియోలైట్ ఫిల్మ్స్‌వారి

సన్ ఆఫ్ సింద్‌బాద్

ప్రేమ్‌నాథ్, జలీల్, నిశి, తివారీ, పద్మిని సుందర్, కుట్టీప్, జగదీష్, భగవాన్, పూర్ణిమ.

దర్శకత్వం. నానాభాయ్‌భట్ సంగీతం చిత్రగుప్త

చిత్ర సికిందరాబాద్ కృష్ణ హైదరాబాద్

పిక్చర్ హౌస్ మల్లేపల్లి

ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30

—శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్—

(TRUPIX)

సాహిత్య ఎకాడమీ ప్రథమవార్షికోత్సవాలు

డాక్టర్ రాధాకృష్ణ అధ్యక్షతన నేడే ప్రారంభం

హైదరాబాదు, జనవరి 10

ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ ప్రథమ వార్షికోత్సవాలు నేటి సాయంకాలం సాహిత్య ఎకాడమీ కార్యాలయంలో (తిలక్ రోడ్డులోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆవరణలో) ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ అధ్యక్షతన ప్రారంభమౌతున్నవి. ఎల్లుండి సాయంకాలము సాహిత్య ఎకాడమీ అధ్యక్షులైన డాక్టర్ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన కవి సమ్మేళనం జరుగగలదు ఎకాడమీ ఉపాధ్యక్షులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, ఎకాడమీ సభ్యులు శ్రీ యు తు లు శివశంకరస్వామి, కాటూరి వేంకటేశ్వరరావు, జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, పూతలపట్టు శ్రీరాములురెడ్డి, గడియారము శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, సి. నారాయణరెడ్డి, వేదుల సత్యనారాయణశాస్త్రి మొదలైన ప్రముఖాంధ్ర కవులు పాల్గొనగలరు.

నేటి ప్రారంభ సమావేశములో సాహిత్య ఎకాడమీ ఇటీవల ప్రకటించిన బహుమతిని, నన్నెచోడుని కవిత్వమును గూర్చి ఉత్తమ తరచనకు, రెండు వేలరూపాయల బహుమతిని ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ శ్రీ వేదం వెంకట్రాయశాస్త్రిగారికి యిస్తారు.

సాహిత్య ఎకాడమీ 1957 ఆగస్టు 7 వ తేదీన రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌గారిచే ప్రారంభించబడినది. ఆ సందర్భమున ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, విద్యా మంత్రి శ్రీ పట్టాభి రామారావుగార్లు సాహిత్య అకాడమి స్థాపన ఆవశ్యకతను, ఆశయాలను వివరించి యుండిరి. 1958 ఆగస్టు 7 వ తేదీనాడు శ్రీ హుమాయున్ కబీరు అధ్యక్షతన సాహిత్య ఎకాడమీ వారు ఒక రచయితల సమావేశం జరిపి యుండిరి.

సాహిత్య ఎకాడమీ పక్షాన రెండు మూడు నెలలలోసామెతల, నుడికారాల సంపుటాలు ప్రకటితం కాగలవు. దీనితో పాటు నన్నయ పదప్రయోగ కోశము కూడా సిద్ధము కాగలదు. ఎకాడమీ కార్యాలయమున ఒక మంచి గ్రంథాలయం నెలకొల్పడానికి కృషి ప్రారంభమైనది. వృత్తి పదకోశమును సిద్ధము చేయు కృషి కూడా చురుకుగా జరుగుచున్నది. గత మాసము ఎకాడమీ ఉర్దూ రచయితల గద్య, పద్యరచనలను రెండు సంపుటాలుగా ప్రకటించి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమసేన్ సచార్‌గారి చేత ఆవిష్కరింపజేసి యుండెను. సాహిత్య ఎకాడమీ నుడికారాల సంపుటానికి శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు, సామెతల సంపుటానికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు, ప్రధాన సంపాదకులుగా నున్నారు. నన్నయ పద ప్రయోగ కోశానికి ప్రధాన సంపాదకులు శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు. వృత్తి పదకోశము పని డాక్టర్ బి. హెచ్. కృష్ణమూర్తిగారి పర్యవేక్షణలో జరుగుచున్నది.

హిందీ వ్యాస రచన పోటీ

హైదరాబాద్, జనవరి 9

దక్షిణ భారత హిందీ ప్రచార సభ సంయుక్త కార్యదర్శి శ్రీ ఎస్. ఆర్. శాస్త్రిగారిట్లు వ్రాస్తున్నారు:-

"హైస్కూళ్ళలో హిందీ నేర్చుకొనుచున్న విద్యార్థులలో ఉత్సాహము నెలకొల్పుటకు గాను దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాసు వారు కేంద్ర ప్రభుత్వము వారి ఆర్థిక సహాయముతో విద్యార్థులలో ప్రత్యేక హిందీ వ్యాస రచన పోటీ నడిపి పుస్తక రూపములో బహుమతులిచ్చుటకు నిర్ణయించినారు.

"దక్షిణ భారతములోని నాలుగు ప్రాంతములకు చెందిన ఆంధ్రప్రదేశ్, మద్రాసు, మైసూరు, కేరళ హైస్కూలు విద్యార్థులందరును పోటీలో పాల్గొనవచ్చును.

"విద్యా సంస్థలలో బోధనభాష (మీడియమ్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్) లేక, "విద్యార్థులు, సమాజసేవ"(స్టూడెంట్స్ అండ్ సోషల్ సర్వీస్) అను విషయమును గురించి పుస్తకపు కాగితము పై ఒకవైపున నే వ్రాసి పంపవలయును. వ్యాసము 8 పేజీలకు తగ్గకుండా 10 పేజీలకు మించకుండా ఉండవలయును. వ్యాసములను ఆయా హైస్కూళ్ళలోని హిందీ పండితుల ద్వారా మా కార్యాలయమునకు పంపవలయును. హిందీ పండితులు ఆ వ్యాసమును విద్యార్థి స్వయముగా వ్రాసినదేనని, దాని విషయమై విద్యార్థి యితరుల నుండి ఎట్టి సహాయమును పొందియుండలేదనియు ధృవపత్రము కూడా పంపవలెయును. ప్రతి ప్రాంతములోను సర్వ ప్రథమ, సర్వ ద్వితీయ, సర్వ తృతీయగా వచ్చిన వ్యాసములకు క్రమముగా 50,30,20 రూ. ల విలువచేయు హిందీ పుస్తకములు బహుమతులుగా పంపబడును.

"వ్యాసములనురిజిస్టరు పోస్టుద్వారా 1959 సం. ఫిబ్రవరి 15వ తేదీలోగా చేరులాగున "సంయుక్త కార్యదర్శి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, త్యాగరాయనగర్, మద్రాసు-17 చిరునామాకు పంపవలెను."

కొత్త చక్కెర ఫ్యాక్టరీలకు కావలసిన యంత్రాలు దేశంలోనే ఉత్పత్తి చెయ్యాలని నిర్ణయం

1960-62 నాటికి నాలుగు సిద్ధం చేయబడగలవట

న్యూఢిల్లీ, జనవరి 8

చక్కెర ఫ్యాక్టరీలకు కావలసిన యంత్ర సామగ్రిని ఇండియాలోనే తయారు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించటానికి ఇక్కడ మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో గైకొనబడిన నిర్ణయాల ఫలితంగా విదేశ మారకద్రవ్యం కొరత వల్ల నిలిచిపోయిన 12 కొత్త చక్కెర ఫ్యాక్టరీలు కొద్ది సంవత్సరాలలో ప్రారంభించ బడటానికి అవకాశం ఏర్పడినది.

కొత్తగా ప్రారంభించ బడనున్న 12 చక్కెర ఫ్యాక్టరీలకు —వాటిలో 11 సహకార చక్కెర ఫ్యాక్టరీలు— కావలసిన యంత్రాలను ఇండియాలోనే రెండు చక్కెర కంసోర్టియమ్‌లు ఉత్పత్తి చేస్తాయి. వీటిలో మొదటిది వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్, టెక్స్‌మేకో, ఇండియా సుగర్, జనరల్ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌లతో ఏర్పడినది. రెండవ కంసోర్టియమ్‌లో కె. సి. పి. లిమిటెడ్, విస్సీ అండ్ కంపెనీ, న్యూ ఇండియా కార్పొరేషన్లు ఉన్నవి.

పై ఏర్పాట్లను ఖాయ పరచిన సమావేశంలో చక్కెర ఫ్యాక్టరీ యంత్రాల ఉత్పత్తి దారుల ప్రతినిధులు, కొత్తగా ప్రారంభించ దలచిన ఫ్యాక్టరీల ప్రతినిధులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, కేంద్రఆహార, వ్యవసాయ, సామాజికాభివృద్ధి, సహకార, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర వాణిజ్య మంత్రి శ్రీ మనూభాయ్ షా సమావేశానికి అధ్యక్షత వహించారు.

1960-62 క్రష్షింగ్ సీజన్ నాటికి నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలకు యంత్రాలను అందజేయాలని పై సమావేశంలో నిర్ణయించబడినది.

రహీమ్ ఫుట్‌బాల్ శిక్షణ పాఠశాల బడ్జెట్, నియమావళి ఆమోదం

హైదరాబాద్, జనవరి 9

రహీమ్ ఫుట్‌బాల్ కోచింగ్ స్కూలు నిర్వహణ కమిటీ నిన్నటిదినం ప్లానింగ్ మంత్రి శ్రీ వి. బి. రాజుగారి గృహంలోనే సమావేశమై, రెవెన్యూబోర్డు జాయింట్ సెక్రటరీ శ్రీ హరి ప్రసాద్ తయారుచేసిన బడ్జెట్‌ను, నియమావళిని ఆమోదించినది.

డైరెక్టర-కమ-చీఫ్‌కోచ్ అయిన శ్రీ ఎస్. ఎ. రహీమ్‌కు నెలకు 1000 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, శ్రీ అహమ్మద్ మొహియుద్దీన్‌కు నెలకు 450 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, సహాయ కార్యదర్శులకు, కోశాధికారికి ఒక్కొక్కనికి నెలకు 75 రూపాయలు ముట్టజెప్పాలని కమిటీ నిర్ణయించినది.

ఇంతేగాక, ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ గరపటానికి 150 రూపాయల జీతంపై ముగ్గురు అధ్యాపకులను నియమించాలని కూడా కమిటీ నిర్ణయించినది.

కళా ఖండాల కొనుగోలు సంఘం

హైదరాబాదు, జనవరి 8

న్యూఢిల్లీలోని జాతీయ వస్తు ప్రదర్శనశాల కళాఖండాల కొనుగోలు సంఘం జనవరి 8 వ తేదీన నవాబ్ మెహిదీ నవాబ్‌జంగ్ అధ్యక్షతన పబ్లిక్ గార్డెన్స్‌లోని అజంతా భవనంలో సమావేశమవుతుంది. జనవరి 9, 10 తేదీలలో కూడా సమావేశాలు జరుగుతాయి. చిత్తరువులు, శిల్పస్థలాలు, కంచు విగ్రహాలు వగైరా కళాఖండాలను జాతీయ మ్యూజియం కొరకు కొనటానికి సంఘం వారు కొన్నిటిని ఎన్నుకుంటారు. తమ వస్తువులు అమ్మదలచిన వ్యక్తులు వాటిని వ్యయంగాకమిటీవారి వద్దకు తెచ్చిపైన పేర్కొన్న తేదీలలో ఉ. 11 గం, సా. 5 గంటల మధ్య కాలములో చూపించవలెను. పబ్లిక్ గార్డెన్స్‌లోని మ్యూజియంలో వున్న జాతీయ మ్యూజియం కార్యదర్శి శ్రీ బి.యన్. భరద్వాజతో కలిసి మాట్లాడవలెను.

తుపాకి కాల్పుల అభ్యాసం

హైదరాబాద్, జనవరి 8

1959 సంవత్సరంలో అప్పుడప్పుడు తుపాకి కాల్పుల అభ్యాసం చేయటానికి భారత సైన్యానికి చెందిన అర్టిలరీ దళాలకు ప్రభుత్వం అనుమతించింది ఆ సమయంలో ప్రమాద మండలంలో గ్రామస్థులు వుండరాదు. దానిలోనికి ప్రవేశించరాదు. మిలటరీ వారు ఉపయోగించిన సాధన సామగ్రిని ఎవరూ తాకరాదు ఈ కాల్పుల అభ్యాసం చేసే ప్రాంతంలోనికి వచ్చే గ్రామాల జాబితా:

ఉత్తరం:- హైదరాబాదు జిల్లాకు చెందిన బగ్గమగూడ, అబ్దుల్లాపల్లి, ఉద్దెమర్రి గ్రామాలు; నల్లగొండ జిల్లాకు చెందిన మునిరాబాద్, బుందకాడిపల్లి, ప్యారారం, చీకటి మామిడి గ్రామాలు.

తూర్పు:- నల్లగొండ జిల్లాకు చెందిన మాచనపల్లి, మారియాల, దాతరపల్లి, ఫకీర్‌గూడ, మగ్దుంపల్లి, జయసేనపల్లి గ్రామాలు.

దక్షిణం: నల్లగొండ జిల్లాకు చెందిన కొండమాడుగు, మహాదేవపురం, జమిలాపేట గ్రామాలు, హైదరాబాద్ జిల్లాకు చెందిన ఖిడేపాగూడా, కీసర, చిర్యాల, అహ్మద్‌గూడ, కుప్పెగూడ, ఖాజాపూర్ గ్రామాలు.

పడమర: హైదరాబాదు జిల్లాకు చెందిన సింగాయపల్లి, తూముకుంట, పామియార్ పేట గ్రామాలు:

కాల్పుల సమయంలో ఖాళీ చేయవలసిన గ్రామాలు:

హైదరాబాదు జిల్లా: ఉప్పరపల్లి, బొమ్మరాజు పేట, పొన్నాల, హుస్సేన్‌పల్లి, కేశవ పురం, ఆరికిరెడ్డిపల్లి, గండరవరసం పల్లి, యాదగిరిపల్లి, తిమ్మాయిపల్లి, ధర్మారం, అంతాయపల్లి, మర్రారం, హరిజానుపల్లి, చెన్నాపురం, బొప్పనూరు, ఇంకా యీ ప్రాంతంలో పడే యితర గ్రామమేదైనా.

నల్లగొండ జిల్లా:- జలాల్ పుర్, తూముకుంట, రామలింగపల్లి, కాజీపేట, మారియాల, రంగాపురం, రామవరం, ధర్మారెడ్డిపల్లి, హోజీపురం, మెరెడ్డిపల్లి, మల్లారం, రహీంఖాన్‌పేట, తిరుమలగిరి, నాగినేనిపల్లి, పర్వతపురం జయపల్లి, యింకా యీ ప్రాంతంలో పడే యితర గ్రామమేదైనా.

కాల్పుల అభ్యాసం జరిగే ప్రాంతం సరిహద్దుల మీదగల జాపులు ఆ సమయంలో ఉపయోగించటానికి వీలుపడదు.

ఆయుర్వేద శిక్షణ తరగతులు

దరఖాస్తులు పంపే తేదీ పొడిగింపు

ఆయుర్వేద శిక్షణ తరగతులకు అభ్యర్థులు దరఖాస్తులు పంపే తేదీ జనవరి 15 నుండి జనవరి ఆఖరు వరకు పొడిగించ బడినవని ఆయుర్వేద కళామందిరం (లింగంపల్లి) కార్యకర్త శ్రీ కె. రాఘవాచార్యులవారు తెలుపుతున్నారు.

దరఖాస్తులను జనవరి 15 వ తేదీలోపుగా పంపాలని పత్రికలలో ప్రకటించడం జరిగింది. వ్యవధి స్వల్పమని చాలామంది తెలపడంవల్ల తేదీపొడిగించబడింది. అభ్యర్థులసంఖ్యగూడా హెచ్చించబడింది. కనుక అభ్యర్థులు ఈ నెలాఖరు వరకు దరఖాస్తులు పంపవచ్చు.

గ్రంథ నిషేధం రద్దు

హైదరాబాద్, జనవరి 8

మత నాయకుల జీవిత గాథలు—అనే పేరుతో భారతీయ విద్యాభవన్ ప్రచురించిన ఆంధ్ర గ్రంథాన్ని లోగడ వీహార్ ప్రభుత్వం నిషేధించింది. తిరిగి ఆ నిషేధం రద్దుచేయ బడింది. మహమ్మద్ ప్రవక్తను గురించి అధ్యాయం తొలగించాలనీ, ఆయన విషయం ఎక్కడా ప్రస్తావించరాదనే షరతుతో యీ నిషేధం తొలగించ బడింది.

జీతాల కమిటీ నిర్ణయాలు

ఖమ్మం కమ్యూనిస్టు సభ అసంతృప్తి

హైదరాబాద్, జనవరి 8

ఖమ్మంలో డిసెంబరు 30 వ తేదీన సమావేశమైన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ జీతాల కమిటీ నివేదికకు అసంతృప్తి వెల్లడించే తీర్మానాన్ని ఆమోదించింది. జీతాల స్కేళ్ళు పెంచాలని, ఇతర కోర్కెలను అంగీకరించాలని కోరుతూ స్వల్ప జీతాలు పుచ్చుకునే ప్రభుత్వోద్యోగులు సాగించే ఆందోళనకు మద్దతు ఇస్తామని పార్టీ వారు తమ తీర్మానంలో హామీ యిచ్చినారు.

నూతన జీతాల స్కేళ్ళు, కరువు భత్యాలు వివిధ ట్రిబ్యునల్సు ఎవార్డులను ననుసరించిగాని, 15 వ కార్మికసభ నిర్ణయాలను అనుసరించిగాని, నానాటికీ పెచ్చుతున్న ధరలను బట్టిగాని, జీవిత వ్యయ సూచీని బట్టిగానీ నిర్ణయించబడలేదని సభవారు అభిప్రాయపడ్డారు. ఈ కారణంచేత జీతాల కమిటీ నిర్ణయాలు వారు నిర్ణయించిన కొత్త స్కేళ్ళు ప్రభుత్వోద్యోగులకు అసంతృప్తి కలిగిస్తున్నవని అన్నారు.

ఎన్ని ప్రతిబంధకాలున్నా జీతాల కమిటీలోని కమ్యూనిస్టు ప్రతినిధి శ్రీ పి. సుందరయ్య వీలయినంత పెచ్చు జీతాలస్కేళ్లను సాధించారని తీర్మానం తెలుపుతున్నది.

ధరవరలు

కొత్తూరు సీతయ్య గుప్త దుకాణం

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్.
గురువారం 8-1-59

వన్న బియ్యం	65-0-0	72-8-0
" "కొ॥	53-0-0	55-0-0
దొడ్డు బియ్యం	48-0-0	49-8-0
" పా॥	59-0-0	60-0-0
బియ్యం అక్కుళ్లు	50-0-0	51-8-0
" పా॥	62-8-0	64-0-0
19 నెం. బియ్యం	51-0-0	52-0-0
తెల్ల జొన్నలు	39-8-0	41-0-0
పచ్చ "	30-0-0	32-0-0
పసుపు	48-0-0	62-0-0
కందులు	61-0-0	65-12-0
ఎర్ర కందులు చి॥	56-11-0	
పెసలు	52-0-0	62-0-0
మినుములు	52-0-0	53-0-0
శనగలు	70-0-0	73-0-0
ఉలవలు	28-14-0	
నెల్లము	36-0-0	43-12-0
మిర్చి	104-0-0	190-0-0
చింతపండు	63-0-0	73-0-0
		75-0-0
ఉల్లిగడ్డ	13-0-0	22-0-0
గోధుమలు	85-0-0	90-0-0
కుసుమలు	48-0-0	52-0-0
నువ్వులు	99-0-0	106-0-0
ఇలాతిపలుకు పె॥	74-0-0	—
ఆముదాలు	55-0-0	56-10-0
పత్తిగింజలు	85-0-0	87-8-0
నూనె 12 సే॥	14-12-0	—
కందిపప్పు పె॥	88-0-0	96-0-0
కందిపప్పు చి॥	85-0-0	86-0-0
మినపపప్పు	85-0-0	86-0-0
పెసరపప్పు	69-0-0	70-0-0
శనగపప్పు	86-0-0	88-0-0
సిరశనగపప్పు	75-0-0	83-0-0
లంకపప్పు	73-0-0	74-0-0
ధనియాలు	45-0-0	78-12-0
యిలాతికాయ	55-0-0	—

వెండి, బంగారం

(దెబ్బడ భూమయ్య నారాయణ దుకాణం)

వెండి, బంగారం నగల వర్తకులు
సిద్ధిఅంబర్ బజార్, హైదరాబాద్.

తేజాపు బంగారం	114-25
కిసాన్ మార్క్ బిల్లలు	114-75
వెండి తు॥ 100 కి	192-00
వెండి తు॥ 1 కి	1-94
నవరసు	72-50

జవహర్ గ్రంథాలయ వార్షికోత్సవం

జడ్‌చర్ల, జనవరి 8

గత ఆదివారం సాయంత్రం ఇక్కడ శ్రీ సి, సోమసుందరంగారి అధ్యక్షతన జవహర్ గ్రంథాలయ వార్షికోత్సవం జరిగినది. శ్రీ కొత్త కేశవులు (పురపాలకసంఘాధ్యక్షులు,) శ్రీ బి. జంగయ్యగారు ప్రసంగించారు. శ్రీ సి. వీరయ్యగుప్త గ్రంథాలయ కార్యదర్శి నివేదిక చదివి వినిపించారు. శ్రీయుతులు పర్వత్‌రాజు, యం. రాంరెడ్డి, జి. అంబురావు, బి. రంగారావుగార్లు గ్రంథాలయ విషయమై ఉపన్యసించిరి.

ఆకాశవాణి

ఆదివారం, జనవరి 11, 1959

హైదరాబాద్

ఎ

40.5.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత (గ్రామఫోన్ రికార్డు) 6-35 కార్యక్రమ వివరణ 6-40 భక్తిరంజని 7-00 తెలుగున వార్తలు 7-15 సంస్కృత కార్యక్రమం (మద్రాస్ నుండి రిలే) 7-30 శంకర్: సితార్ 7-45 సంగీత శిక్షణ 8-00 ఆంగ్లమున వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 శంకర్: సితార్ 8-45 పిల్లలకు కొత్త ఉపన్యాసాలు(స్టూడియో రికార్డింగ్) 9-00 పిల్లల కార్యక్రమము (ఉర్దూ) 9-30 ప్రసార సమాప్తి

మ॥ 12-30 ఫిల్మ్‌గీత్ (గ్రామఫోన్ రికార్డ్) 1-00 వాద్యగోష్ఠి (మద్రాస్ నుండి రిలే) 1-30 ప్రాదేశిక్ సుగమ్ సంగీత్ (స్టూడియో రికార్డింగ్) 1-50 తెలుగున వార్తలు 2-00 శాస్త్రీయ సంగీతము (గ్రామఫోన్ రికార్డు) 2-20 హైదరాబాద్ ఎ వరలె 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 నగరవాణి 7-00 తెలుగున వార్తలు 7-15 కన్నడ భావగీతాలు (గ్రామఫోన్ రికార్డు) 7-30 రేడియో వార్తా వాహిని, (విజయవాడ నుండి రిలే) 7-40 చిత్ర సీమ (గ్రామఫోన్ రికార్డు) 8-00 ద్వారం వెంకటస్వామి నాయుడు: వయొలిన్) స్టూడియో రికార్డింగ్) తోడి రాగం, తానం, పల్లవి 8-30 మేటర్స్ ఆఫ్ మొమెంట్ (ఢిల్లీ నుండి రిలే) 8-50 సుగమ్ సంగీత్ (స్టూడియో రికార్డింగు) 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 ఉర్దూలో వార్తలు 9-30 సుగమ్ సంగీత్ (స్టూడియో రికార్డింగ్) 10-00 భక్తిరంజని, సదాశివబ్రహ్మేంద్ర కీర్తనలు: బాలమురళీకృష్ణ (విజయవాడ నుండి రిలే) 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

బి

42.02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎవరలె 8-45 ప్రసార సమాప్తి. 9-00 ద్వారం వెంకటస్వామి నాయుడు: వయొలిన్ (స్టూడియో రికార్డింగ్) 9-30 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720కిలోసై)

మ॥ 12-30 హైదరాబాద్ ఎ వరలె 2-10 శాస్త్రీయ సంగీతము (గ్రామఫోన్ రికార్డు) 2-20 హైదరాబాద్ ఎ వరలె 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వరలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము; యక్షప్రశ్నలు: బుర్రకథ, జి. బాలకృష్ణమూర్తి, బృందము 7-00 తెలుగున వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 హైదరాబాద్ ఎ వరలె 7-45 పదం, జావళి 9-30 హైదరాబాద్ ఎ వరలె 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

(357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం 6-35 ప్రసార విశేషాలు 6-40 భక్తిరంజని 7-00 తెలుగున వార్తలు 7-15 సంస్కృత కార్యక్రమము (మద్రాస్ నుండి రిలే) 7-30 మృత్యుంజయ విలాసము నుండి పాటలు (స్టూడియోరికార్డింగ్) 7-45 సంగీతశిక్షణ (హైదరాబాద్ నుండి రిలే) 8-00 ఆంగ్లమున వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 1-00 వాద్యగోష్ఠి (మద్రాస్ నుండి రిలే) 1-30 ప్రొఫెసర్ నారాయణరావ్ వ్యాన్ (గ్రామఫోన్ రికార్డ్) 1-50 తెలుగునవార్తలు 2-00 లలిత సంగీతం (స్టూడియో రికార్డింగ్) 2-20 బొమ్మరిల్లు (పిల్లల కార్యక్రమము) 3-00 వి.ఆర్. గజలక్ష్మి (మద్రాస్ నుండి రిలే) 4-00 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 గ్రామస్థుల కార్యక్రమము, యక్షప్రశ్నలు: బుర్రకథ, జి. బాలకృష్ణమూర్తి, బృందము 7-00 తెలుగున వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 రేడియో వార్తావాహిని 7-40 లలిత సంగీతం: టి. బసవకుమారి 8-00 ఈమని శంకరశాస్త్రి: వీణ 8-30 మేటర్స్ ఆఫ్ మొమెంట్ 8-45 శాస్త్రీయ సంగీతము (గ్రామఫోన్ రికార్డులు) డి. చెల్లం అయ్యంగార్, టి ఆర్. బాల సుబ్రహ్మణ్యం 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 లలిత సంగీతం: టి. బసవకుమారి 9-30 ఆంధ్రదేశపు జానపద గీతాలు 9-50 ఉభయకుశలోపరి-భక్తుల ఉత్తరాలకు జవాబులు 10-00 భక్తిరంజని: సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు: బాలమురళీ కృష్ణ 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

బెల్జియన్ కాంగోలో ఆఫ్రికన్ నాయకుల అరెస్టు

బ్రెస్సెల్స్, జనవరి 8

"అబాకో" అనే ఆఫ్రికన్ రాజకీయ ఉద్యమానికి నాయకుడైన ఎమ్. కాసాంబ్రా నేడు బెల్జియన్ కాంగో రాజధానిలో అరెస్టు చేయబడ్డాడు.

బెల్జియన్ కాంగోలో ఈ వారం అల్లర్లు చెలరేగిన విషయం పాఠకులకు విదితమే.

రెండు రోజుల క్రితం డేనియల్ కాజ్జా అనే మరొక "అబాకో" నాయకున్ని కూడా అరెస్టు చేశారట.

ఉత్తర మొరాకోలో తిరుగుబాటు దారుల అరెస్టులు

రాబత్, జనవరి 8

ప్రభుత్వానికి లొంగి పోవటానికి మహమ్మద్ రాజు పెట్టిన గడువు దాటి పెక్కుమంది తిరుగుబాటు దారులు "కల్లోల ప్రియులు" అరెస్టు చేయబడినట్టు తెలియ వచ్చినది.

అడవి భూముల కేటాయింపు

హైదరాబాద్, జనవరి 8

1949 నుండి శ్రీ వి. గోపాలరాజు వగైరాలు సేద్యం చేసుకుంటున్న నల్లగొండ జిల్లా పర్వతగిరి గ్రామంలోని సర్వే నెం. 178, 203, 216, 217, 218 లలో 23 ఎకరాల ప్రాంతాన్ని అడవి నుండి విడదీసి, రెవెన్యూశాఖ పరం చేయాలనీ, సదరు భూమి 25-7-58గల రెవెన్యూ శాఖ జి. ఒ. నెం. 1404 లోని సూత్రాల మేరకు కేటాయించబడాలనీ ప్రభుత్వం ఉత్తరువు చేసింది.

ఇజ్రాయిల్ విమానం కూల్చివేత

కైరో, జనవరి 8

సినాయ్ ద్వీపకల్పంపై నేడు చెలరేగిన వైమానిక పోరాటంలో ఈజిప్టు ఫైటర్ విమానాలు ఒక ఇజ్రాయిల్ ఫైటర్ విమానాన్ని కూల్చివేసి, మరొకదానిని దెబ్బతీసినవని నేటిరాత్రి ఇక్కడ వెలువడిన ఒక సైనిక ప్రకటనలో వెల్లడించబడినది.

విమానం కూల్చివేత ఇజ్రాయిల్ భూభాగం లోనే జరిగినదట. మరొక విమానానికి గుండు దెబ్బ తగలగా, అది మబ్బుల్లో మాయమైనది. తక్కిన విమానాలు పలాయనం చిత్తగించాయట.

శ్రీవత్స వారి

కిల్‌క్రిమ్

ఈగలను దోమలను. పల్లులను పట్టి చంపును

శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ (ప్రైవేట్) లిమిటెడ్ మద్రాసు

బాంధవ్యాలు

సబ్బు, పౌడరు, తైలం

సి.సి. మహాజన్ అండ్ కం. బొంబాయి
C.C. MAHAJAN & CO. BOMBAY-8.

4 వ దిగ్విజయ వారం

సికిందరాబాద్

ప్లాజా PLAZA సెసిల్ బి. డీమిల్లీ సమర్పించు ఫోన్: 86555

ది టెన్ కమాండ్‌మెంట్స్

"THE TEN COMMANDMENTS"

ఆటల సమయాలు: 5-00, 9-15

4వ వారంలో కూడా ఎడ్వాన్స్ బుకింగ్ గలదు.

ప్రవేశ రుసుములు: డ్రెస్ సర్కిల్ రూ. 3-50, స్టాల్స్ రూ. 3-00,

మొదటి తరగతి రూ. 1-80, రెండవ తరగతి రూ. 0-90

గమనిక: ఈ చిత్రం ప్రత్యేకంగా ప్లాజాలోనే ప్రదర్శింప బడుతుంది.

2-వ దిగ్విజయ వారం!

గోల్డెన్ మూవీస్ సమర్పించు

టాక్సి 555

ప్రదీప్‌కుమార్, షకీలా, మహిపాల్, లలితాపవార్, సుందర్, మారుతి, అజ్రా (మదర్ ఇండియా ఫేమ్)

దర్శకత్వం లేఖ్‌రాజ్ భాక్రీ | పాటలు ప్రేమ్‌ధవన్ | సంగీతం సర్దార్ మలిక్

అశోక్ - హైదరాబాద్

ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30

(Trupix) - విజయ రిలీజ్ -

జయప్రదమైన 6వ సంయుక్తవారం!



భాస్కర ప్రొడక్షన్స్ వారి

పార్వతీకల్యాణం

దర్శకుడు భాస్కరరావు

(ప్రతిస్త్రీకి ఒక చక్కని సందేశాన్నందించే చిత్రం)

కృష్ణకుమారి, బాలయ్య, గుమ్మడి, రాగిణి, నాగయ్య, సంధ్య, రమణారెడ్డి

దర్శకుడు భాస్కరరావు | సంగీతం ఘంటసాల | కెమేరా కమల్‌ఘోష్

సాగర్ హైదరాబాద్ | రాజేశ్వర్ సికిందరాబాద్ | మార్కండేయ వరంగల్

ఆ

వేతనాల సంఘం సిఫార్సులు

సజీవంగా లేవని కమ్యూనిస్టు నాయకుల సంయుక్త ప్రకటన

హైదరాబాద్, జనవరి 9

వేతనాలసంఘం సిఫారసుచేసిన "పే స్కేలు" సజీవంగా లేవని రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు వాటిని ఏ విధంగా విశ్లేషిస్తున్నారని, ఆందోళన పడుతున్నారని ఆంధ్రప్రదేశ్‌లోని ముగ్గురు కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్ నాయకులు నేడొక సంయుక్త ప్రకటన చేశారు.

కమ్యూనిస్టుల యాజమాన్యానఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఎగువ సభలో ప్రతిపక్ష నాయకుడుఅయిన మక్దుం మొహియుద్దీన్, పార్లమెంటు సభ్యుడు శ్రీ కె. ఎల్. నరసింహన్, ఎ. పి. టి. యు. సి. కార్యదర్శి శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డిగార్లు పైప్రకటనపై సంతకాలు చేశారు.

ఆర్థిక మంత్రి అధ్యక్షుడుగా ఉన్న వేతనాల సంఘంలో కమ్యూనిస్టు ప్రతిపక్ష నాయకుడు శ్రీ పి. సుందరయ్యగారు కూడా సభ్యులుగా ఉన్నారు వేతనాల సంఘం ఏకగ్రీవంగా పైసిఫార్సులు చేసింది.

వేతనాల సంఘం, ప్రస్తుతం ఉన్న జీవన ప్రమాణాన్ని ఆధారం చేసుకొని వేతనాల స్వరూపాన్ని తయారు చేయలేదని, అవసరాలను ఆధారం చేసుకుని వేతన సూత్రాలను నిర్ణయించాలని కేంద్రప్రభుత్వం, 14రాష్ట్ర ప్రభుత్వాలు, యజమానుల, ఉద్యోగుల సంఘాలు, 1957 జూలైలో జరిగిన 15వ అఖిల భారత కార్మిక సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన విషయాన్ని త్రోసిరాజనటం జరిగిందని ట్రేడ్ యూనియన్ నాయకులు వెల్లడించారు.

జీవన ప్రమాణ సూచితో కరువు భత్యాన్ని కలపక పోవటం వల్ల, నిత్యావసర వస్తువుల ధరలుఅమితంగా పెరగటం వల్ల సంభవిస్తున్న ఉపద్రవం నుంచి వేతనాల సంఘం ఏ విధమైన రక్షణను ఉద్యోగులకు ఇవ్వలేకపోవటం జరిగిందని కూడా కమ్యూనిస్టు నాయకులు ప్రకటించారు.

ఆంధ్ర-తెలంగాణాలలోని పే స్కేళ్లను ఒకే విధంగా తయారు చేసినందుకు వేతనాల సంఘాన్ని కమ్యూనిస్టు నాయకులు అభినందించారు. కొన్ని వందల పద్ధతులలో ఉన్న పేస్కేలును 33 పద్ధతులుగా తగ్గించటం వేతనాల కమిటీ చేసిన ఉపకారమే నని కూడా వారు వెల్లడించారు.

"ప్రెసిడెంట్ వెజిటబుల్ హేరాయిల్, ప్రెసిడెంట్ నూనె, ప్రెసిడెంట్ టాల్కం పౌడర్లు ఇతరవాటన్నిటికంటె శ్రేష్ఠమైనవని నేను ఉపయోగించి తెలుసుకున్నాను" అని ప్రసిద్ధ సినీ తార పద్మిని చెప్పుచున్నది.

తయారుచేయువారు
రథోడ్ ట్రేడింగ్ కంపెనీ,
మద్రాసు - 1

అ.భా.పా. ప్రదర్శనలోమా 24, 25వ నెంబరు స్టాల్సు వద్ద ప్రెసిడెంట్ వస్తువులను కొన్నవారికి ఒక క్యాలెండరు ఉచితం!

ఎమ్మిగనూరు వ్యవసాయక్షేత్రం

హైదరాబాదు, జనవరి 9

జనవరి 4వ తేదీన ఎమ్మిగనూరులో వ్యవసాయ ప్రదర్శన పరిశోధన క్షేత్రానికి వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ పి. తిమ్మారెడ్డిగారు ప్రారంభోత్సవం చేశారు. స్థానిక పరిపాలన శాఖామాత్యులు శ్రీ డి. సంజీవయ్యగారు అధ్యక్షత వహించారు.

శ్రీ తిమ్మారెడ్డిగారు ప్రసంగిస్తూ రైతులు సంఘాలుగా ఏర్పడి తమ యిబ్బందులను ప్రభుత్వానికి నివేదించుకోవాలని సూచించారు. అధికార్లతో కలిసి పనిచేస్తూ వారి సహాయాన్ని రైతులు పొందాలనీ, ప్రస్తుత విధానాలను మార్చి యాంత్రిక వ్యవసాయ విధానాలు ప్రవేశపెట్టాలనీ, వ్యవసాయ పరిశ్రమలు నెలకొల్పాలనీ సూచించారు. శ్రీ డి. సంజీవయ్యగారు మాట్లాడుతూ అనంతరామన్ కమిటీ నివేదిక అందిన తర్వాత పన్నుల విధానం మార్చే విషయం ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

బెన్‌గాజి, లిబియాన్, జనవరి 7

లిబియాకు రష్యా ఇవ్వజూపిన ఆర్థిక సహాయం బాగోగులను పరిశీలించటానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని నియమించినట్టు లిబియాన్ అధికార ప్రతినిధి ఒకరు నేడు ప్రకటించారు.

మిగులుభూమి సేద్యం

(1వ పేజీ తరువాయి)

శ్రీ బ్రిజ్ బెహారీ ప్రతిపాదించిన సవరణను, మిగులు భూమిని పంచాయతుల పరం చేసే బదులు దానిని భూమిలేని కూలీలకు పంచిపెట్టాలంటూ పశ్చిమ బెంగాల్ సభ్యుడు శ్రీ నారాయణ్ ప్రతిపాదించిన సవరణను, 1959 సంవత్సరాంతం నాటికి గాక, ఈ సంవత్సరం మార్చినాటికే భూ కమతాలకు గరిష్ఠ పరిమితి నిర్ణయించటానికి సంబంధించిన శాసనాలు పూర్తి కావాలంటూ పంజాబ్ సభ్యుడు శ్రీ అబ్దుల్ ఘనీదార్ ప్రతిపాదించిన సవరణను సభవారు త్రోసిపుచ్చారు.

అతి దీనస్థితిలోఉన్న రైతుల సమస్యను పరిష్కరించటానికి సహకార పద్ధతివినా మరొకమార్గంలేదని తీర్మానాన్ని బలపరుస్తూ కేంద్రఆహారమంత్రి శ్రీ ఎ. పి. జైన్ అన్నారు. మార్పులు పనికిరావంటూ కూర్చుంటే పేదరికాన్ని నిర్మూలించటం సాధ్యంకాదని ఆయనఅన్నారు.

యు. పి. రెవెన్యూమంత్రి సూచించినట్టు పన్నులద్వారా కమతాలను పరిమితంచేయటం సాధ్యంకాదని కేంద్ర ప్లానింగ్ శాఖ ఉపమంత్రి శ్రీ ఎన్. ఎన్. మిశ్రాఅన్నారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాల స్థాయికి రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలను పెంచే అవకాశం ఉన్నదని, ఈ కొత్త "స్కేలు" ఆంధ్ర-తెలంగాణాల ఉద్యోగుల మధ్య ఉన్న అవరోధాలను తొలగించినాయని అంటూ, ఉద్యోగులు సిటీ అలవెన్సు కోసం, ముసుపటిమాదిరి పని చేసే కాల పరిమితి కోసం, పరిపూర్ణమైన నిపుణత కలవారు, సాధారణమైన నిపుణత కలవారు అని ఉద్యోగులను పునర్విభజించటం కోసం సమిష్టిగా పోరాటాన్ని సాగించాలని అటువంటి పోరాటానికి ఎ. పి. టి. యు. సి. సంపూర్ణ సహకారం చేస్తుందని కూడా కమ్యూనిస్టు నాయకులు తెలియ పరిచారు.

ఖమ్మం కలెక్టరు ఆఫీసు

సూత్న భవనానికి శంకుస్థాపన

ఖమ్మం, జనవరి 9

గవర్నర్ శ్రీ భీమసేన్‌సచార్ నేడిక్కడ కలెక్టర్ ఆఫీసు భవనానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి 7 లక్షల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వేశారు.

శ్రీ సచార్ ఖమ్మంజిల్లా ప్రదర్శనకు కూడా ప్రారంభోత్సవం జరిపారు.

ఆ తర్వాత, బహిరంగ సభలో ప్రసంగిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వంతో సర్వ విధాలా సహకరించవలసిందిగా శ్రీ సచార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిని సాధించాలంటే ప్రజలు సమిష్టిగా కృషి చెయ్యటం అవసరమని ఆయనఅన్నారు.

స్థానిక మునిసిపల్ కమిటీ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి, ఎక్కువ సౌకర్యాలు కావలిస్తే ప్రజలు ఎక్కువగా పన్నులు చెల్లించక తప్పదని శ్రీ సచార్ అన్నారు.

బహిరంగసభ అనంతరం, జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌లతో సహా శ్రీ సచార్ కొత్తగూడెం వెళ్లారు.

కాంగ్రెస్ మహాసభ విశేషాలు

అభ్యంకర్‌నగర్, జనవరి 9

అఖిలభారత కాంగ్రెస్ 64వ మహాసభ ఈరోజు మధ్యాహ్నం 3-10 గంటలకు ప్రారంభమైనది.

మహాసభ కార్యక్రమం ప్రారంభం కాక కొద్దిసేపు ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు ఢేబర్, ప్రధానినెహ్రూ, దేశ వ్యవహారాలమంత్రి శ్రీ జి. బి. పంత్ తదితర కాంగ్రెస్ నాయకులు ఊరేగింపులో వెళ్ళారు.

ఊరేగింపుముందు సేవాదళం వలంటీర్లు బ్యాండు వాయిస్తూ వెళ్ళారు.

ఎంతో మనోహరంగా అలంకరించబడినఆరడుగులఎత్తువేదికపైకి శ్రీ ఢేబర్ ఎక్కుతుండగా ప్రజలు హర్షధ్వానాలు చేశారు. మహాసభలకు సుమారు ఒకటిన్నర లక్ష మంది జనం హాజరైనారు. "వందేమాతరం" గానంతో మహాసభ ప్రారంభమైంది.

వేదిక ముందున్న ఆవరణలో 4500 మాజీ ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు, విదేశ పరిశీలకులు కుర్చున్నారు. విదేశ ప్రతినిధులలో బ్రిటన్, అమెరికా, ఆఫ్రికా దేశాలనుంచి ఇద్దరేసి, ఆస్ట్రేలియా నుంచి ఒకరు హాజరైనారు.

మహాసభ ప్రారంభమవటానికి మూడు గంటల ముందునుంచి సభాస్థలానికి వెళ్లే రోడ్డు కిరువైపులా వేలాదిమంది ప్రజలు వేచి నిల్చున్నారు. వీరిని అదుపులో పెట్టడానికి పోలీసులు, సేవాదళం వలంటీర్లు నానా అవస్థలు పడవలసి వచ్చినది.

అధ్యక్షుడు వచ్చేసరికి సభా స్థలం సగానికి సగం నిండి పోయినది. బయట ఎందరో వేచి ఉన్నారు.

38 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ మహాసభ తిరిగి ఇక్కడ జరుగుతున్నది. గత సమావేశం 1920లో జరిగినది. సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాలన్న చరిత్రాత్మక నిర్ణయము, గాంధీజీ నాయకత్వాన్ని పూర్తిగా అంగీకరించటము ఇక్కడే జరిగాయి.

ప్రేక్షకులలో కొందరు అకస్మాత్తుగా వేదికపైపు పరుగెత్తేసరికి సభా కార్యక్రమం 15 నిమిషాలు ఆగిపోవలసి వచ్చినది. క్రమశిక్షణను నెలకొల్పటానికి వలంటీర్లు విఫలప్రయత్నం చేశారు.

గలభా పెరిగిపోయేసరికి ఢేబర్, బొంబాయిముఖ్యమంత్రి శ్రీ వై. బి. ఛవాన్ ప్రేక్షకులనుకూర్చోవలసినదిగా అనేకసార్లు విజ్ఞప్తిచేశారు. కానిఎవ్వరూ వినిపించుకోలేదు.

అప్పుడు ప్రధానినెహ్రూ కాశ్మీర్ ప్రధానినివెళ్ళి వలంటీర్లకు సహాయపడవలసిందిగా కోరారు. శ్రీఖలీ ప్రజల కోసివెళ్ళి వారిని కూర్చోబెట్టారట.

ఈ గలభాకారణంగా తన ఆహ్వానోపన్యాసాన్ని చదవటం మానివేసిన శ్రీమతి గోపికాబాయి కన్నంవార్ అప్పుడు తమప్రసంగాన్ని పూర్తిచేశారు తర్వాత శ్రీ ఢేబర్ అధ్యక్షోపన్యాసం చేశారు

మనిషితో రాకెటు ప్రయోగం

ఆఫ్రికాన్స్ పత్రిక వార్త ఖండన

మాస్కో, జనవరి 8

అంతరిక్ష యాత్రలో ఒక మనిషికి శిక్షణ ఇవ్వబడుతున్నట్టు ప్రముఖ రష్యన్ రాకెట్ నిపుణుడు ప్రొఫెసర్ అనాతోలి బ్లాగోనరవోవ్ చెప్పలేదని సోవియట్ విజ్ఞాన ఎకాడమి ప్రతినిధి ఒకరు నేడు ప్రకటించారు.

(కేప్ టౌన్‌లో డైలాండ్‌స్టెమ్ అనే ఆఫ్రికాన్స్‌పత్రిక ఒకఇంటర్‌వ్యూలో తమ విలేఖరికి శ్రీ బ్లాగోనరవోవ్ మనిషితో శుక్ర, కుజగ్రహాలకు వచ్చే సెప్టెంబర్‌లోగా రష్యా రాకెట్లు ప్రయోగించగలదని చెప్పినట్టు వార్తనిచ్చినది.)

బ్లాగోన్ రవోవ్‌తో మాట్లాడిన తర్వాత రాయిటర్ విలేఖరితో ముచ్చటిస్తూ ఆ ప్రతినిధి ఆఫ్రికాన్స్ పత్రికకు ప్రొఫెసర్ ఇంటర్‌వ్యూ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఆ దక్షిణాఫ్రికా వార్తాపత్రిక తన పేరుతో ఆవ్యాసం ప్రచురించటానికి ఆధార మేమీలేదని ప్రొఫెసర్ అన్నారట.

ఈ వారం ఆరంభంలో మాస్కోలో పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ తాము చెప్పినదానికి మించి చెప్పగల్గిందేమీ లేదని ప్రొఫెసర్ బ్లాగోన్‌రవోవ్ అన్నారట. (ఇంతవరకు మనిషెవరు అంతరిక్ష రాకెట్‌లో ప్రయాణం చేయటం జరగలేదని, మనిషి తిరిగి రాగలడన్న నమ్మకం కుదిరేవరకు ఎవ్వరినీ రాకెట్‌లో పెట్టి ప్రయోగించటం జరగదని ఇంతకు ముందు ఆయన అన్నాడు.

విజయవాడలో సంపూర్ణ హర్తాళ్

రిక్షా డ్రైవర్లపట్ల సానుభూతి సూచకంగా

విజయవాడ, జనవరి 8

గత 22 రోజులుగా సమ్మెసాగిస్తున్న సుమారు 2 వేల మంది రిక్షాడ్రైవర్ల పట్ల సానుభూతి సూచకంగా, నిన్నటి దినం ఇక్కడ సంపూర్ణహర్తాళ్ జరిగినది.

విజయ పట్టణ కమ్యూనిస్టు కమిటీ, ప్రజాసోషలిస్టుపార్టీ, సిటిట్రేడ్ యూనియన్ కౌన్సిల్ తదితర సంఘాల సంయుక్త అధ్వర్యాన ఈహర్తాళ్ జరిగినది.

హర్తాళ్ ముఖంగా నగరంలో వాణిజ్యవ్యాపారాలు, తదితర కార్యకలాపాలు పూర్తిగా స్తంభించి పోయినవి. ఆఖరుకు బస్సులనుడా పగలు 11,12 గంటల మధ్య నిలిపివేయ వలసివచ్చినది.

బలవంతంగా దుకాణాలు మూసివేయిస్తున్నాడని చెప్పిపోలీసులు ఎగువ సభ సభ్యుడు శ్రీ గుట్టా తాజారావును (సోషలిస్టు) అరెస్టు చేశారు.

రాష్ట్రంలో కెల్లా అత్యధికంగా ఉన్న రిక్షాకిరాయిని యజమానులు రెండున్నర రూపాయల నుంచి 2 రూపాయలకు తగ్గించాలని కోరూతూ రిక్షా డ్రైవర్లు 22 రోజుల క్రితం సమ్మె ప్రారంభించారు.)

మునిసిపల్ కార్మికులు, ఆంధ్రా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, ఇతర పారిశ్రామిక సంస్థలలో పని చేస్తున్న కార్మికులు రిక్షా డ్రైవర్ల పట్ల సానుభూతి సూచకంగా సమ్మె చేశారు.

డాక్టర్ ఆచంట లక్ష్మీపతి

హైదరాబాద్, జనవరి 8

దేశీయ వైద్య కేంద్ర సంఘాధ్యక్షులు డాక్టర్ ఆచంట లక్ష్మీపతిగారు మద్రాసు నుంచి నేడు ఇక్కడికి విచ్చేశారు. ఇక్కడి నుంచి రేపు వారు ఢిల్లీ వెళ్ళి, అక్కడి నుంచి షిల్లాంగ్ వెడతారు. అక్కడ 15, 16, 17 తేదీలలో జరుగనున్న ఆరోగ్యశాఖ మంత్రుల సభలో పాల్గొని జనవరి 20వ తేదీన నగరానికి తిరిగి వస్తారు.

ఆర్థిక వివాదాల పరిష్కారం

బ్రిటన్, ఈజిప్టుల మధ్య ఒప్పందం

కైరో, జనవరి 8

ఆర్థిక విషయాలకు సంబంధించి బ్రిటన్, ఈజిప్టు నేడు పూర్తిగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నట్టు తెలుస్తున్నది.

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు శ్రీ బ్లాక్ మధ్యవర్తిత్వ ఫలితంగా నేబ్రిటన్, ఈజిప్టుల మధ్యగల వివాదాలు పరిష్కారమైనవి.

ఈ ఒప్పందం ప్రకారం, సూయజ్ కంపెనీ జాతీయకరణ కారణంగా బ్రిటన్ తాకిపెట్టి ఉంచిన 75 కోట్ల స్టెర్లింగ్ ఇప్పుడు ఈజిప్టుకు ఇవ్వబడుతుంది.

Printed and Published by Srimati Sita Yudhvir at 'Vir Milap Press' Mukarramjahi Road, Hyderabad, Editor: K. S. Subrahmanyam.

శాస్త్రవేత్తల సమావేశం

న్యూఢిల్లీలో జనవరి 21 న ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 9

జనవరి 21వ తేదీ నుంచి న్యూఢిల్లీలో జరుగనున్న ఇండియన్ సైన్సు కాంగ్రెస్ 46వ సమావేశానికి 3 వేల మందికి పైగా శాస్త్రవేత్తలు హాజరు కానున్నారని, వారిలో విదేశాల నుంచి వచ్చే 100 మంది ప్రతినిధులు కూడా ఉంటారని భావింపబడుతున్నది.

ఢిల్లీ విశ్వ విద్యాలయంలో జరిగే పై సమావేశాన్ని ప్రధాని నెహ్రూ ప్రారంభిస్తారు.

పై సమావేశం వారం రోజులపాటు జరుగుతుంది.

శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి కృషిచేసే బ్రిటిష్ అసోసియేషన్ ప్రతినిధివర్గ నాయకుడుగా ఎడింబర్గ్ ప్రభువుప్రిన్స్ ఫిలిప్ వస్తారని భావింపబడుతున్నది.

అమెరికాలోను, రష్యాలోను, కెనడా జకోస్లవేకియా, చీనా, ఫ్రాన్సు, జపాన్, నార్వే, స్వీడెన్, పోలెండ్ తూర్పు పశ్చిమజర్మనీలలో, శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన అకాడమీలకు, సంఘాలకు సైన్సుకాంగ్రెస్, భారత ప్రభుత్వాలు ఆహ్వానాలు పంపినట్టు తెలుస్తున్నది.

ఈవారం బొంబాయిలో జరిగే హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్ వజ్రోత్సవ సమావేశాలకు హాజరయ్యే ప్రతినిధులు, యునెస్కో, ఎఫ్. ఎ. ఓ, ప్రపంచ ఆరోగ్యమండలి మొదలైన అంతర్జాతీయసంస్థల ప్రతినిధులుకూడా పై సమావేశంలో పాల్గొంటారు.

ఇండియన్ సైన్సు కాంగ్రెస్ 13 విభాగాలుగా చీలి శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన "పేపర్సును" చర్చిస్తుందని, చర్చాసమావేశాలు జరుపుతుందని, తెలుస్తున్నది.

భారత దేశంలోని 14 జాతీయ భాషలలోను ప్రచురింపబడిన శాస్త్ర గ్రంథాలకు సంబంధించిన ప్రదర్శనం ఒకటి, శాస్త్ర పరికరాలకు పనిముట్లకు సంబంధించిన ప్రదర్శనం మరొకటి ఈసందర్భంలో నిర్వహింపబడుతాయి.

ఢిల్లీ విశ్వవిద్యాలయోపాధ్యక్షుడు, ఆహ్వాన సంఘాధ్యక్షుడు అయిన డాక్టర్ వి. కె. ఆర్. రావు నేడు పత్రికావిలేఖరుల గోష్ఠిలోప్రసంగిస్తూ భారత దేశంలోని వివిధ భాషలలోను ప్రచురింపబడిన 10 వేల గ్రంథాలయినా ప్రదర్శింపబడతాయని, వాటికి విశ్వ విద్యాలయాల గ్రాంట్సు కమిషన్ అధ్యక్షుడు శ్రీ సి. డి. దేశ్‌ముఖ్ జనవరి 22 వ తేదీన ప్రారంభోత్సవం చేస్తారని తెలియపరిచారు.

కళాశాలలలోను, పాఠశాలలలోను పాఠ్య గ్రంథాలుగా ఉపయోగింపబడే శాస్త్ర గ్రంథాలు కూడా ప్రదర్శనలో ఉంచబడతాయని ఆయన అన్నారు.

ప్లానింగ్ సైకిల్ స్వారీ లాటిది

అభ్యంకర్‌నగర్, జనవరి 9

ప్లానింగ్ సైకిల్ స్వారీ లాటిదని ప్రధాని నెహ్రూ నేడు పోల్చి చెప్పారు.

64వ కాంగ్రెస్ మహాసభలో ప్లానింగ్ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న శ్రీ నెహ్రూ ఇంకా ఇలా అన్నారు: "మీరు ఒక సారి ప్లానింగ్ ప్రారంభించారంటే ఇక ఆపటమనేది ఉండదు. ఈ ప్లానింగ్ అనేది సైకిల్ స్వారీ లాటిది. మీరు పెడల్ త్రొక్కుతూనే ఉండాలి. తొక్కటం మానివేశారంటే క్రింద పడిపోతారు."

స్టెయిన్‌లెస్ స్టీలు రేకుల దిగుమతికి అనుమతి

న్యూఢిల్లీ, జనవరి 8

ఎగుమతుల అభివృద్ధిపథకంక్రింద విదేశాలకు స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు, గడియారం పట్టాలు మొదలగునవి ఎగుమతి చేయటానికి వీలుగా స్టెయిన్‌లెస్ స్టీలు రేకులు, కడ్డీలు, తునకలు, తీగెల దిగుమతికి అనుమతి ఇవ్వాలని భారత ప్రభుత్వం నిర్ణయించినది,

ఆల్జీరియాలో 236 మంది విప్లవ వీరులు హతం

ఆల్జియర్స్, జనవరి 8

తూర్పు ఆల్జీరియాలోని కాబిలి పర్వత ప్రాంతంలో ఫ్రెంచి సైనికులు సాగించినదాడిలో 236 మందివిప్లవవీరులు మరణించినట్టు, మరి 12 మంది పట్టుబడినట్టు నేడిక్కడ అధికార రీత్యా ప్రకటించబడినది.

సినిమాల చట్టంనుండి మినహాయింపు

హైదరాబాద్, జనవరి 8

అమృతాంజన్ లిమిటెడ్ వారి వస్తువుల ప్రచార సందర్భంలో సంచారక సినిమా శకటం ద్వారా ఫిల్ములు ప్రదర్శించే పర్యాటనను 1955 సం.పు ఆంధ్ర, 1952 సం.పు, హైదరాబాదు సినిమా ప్రదర్శన చట్టంలోని 3వ సెక్షను నుండి ప్రభుత్వం మినహాయించింది.

చెరుకు బెల్లం గ్రేడింగు

న్యూఢిల్లీ, జనవరి 7

కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన మార్కెటింగ్, ఇన్‌స్పెక్షను శాఖ డైరెక్టరేటు వ్యవసాయోత్పత్తుల (గ్రేడింగు, మార్కింగు) చట్టం (1937) క్రింద చెరుకు బెల్లాని, రకం వారీగా విభజించటం, బంగీరట్టడం, గుర్తులు వేయడం యీ మొదలైన పద్ధతులను వివరిస్తూ ఒక కరపత్రాన్ని ప్రచురించింది.

"చెరుకు బెల్లం గ్రేడింగుకు సూచనలు" అని ఈ కరపత్రం పేరు. చెరుకు బెల్లం గ్రేడింగు, మార్కింగు పద్ధతులకు సంబంధించిన నియమావళి, అందుకు నిర్దేశించిన ప్రమాణాలూ యీ కరపత్రంలో పొందుపరిచారు.

వ్యాపారస్థులకూ, వాడకం దార్లకూ పై విషయాలను తెలియ జెప్పడమే ఈ కరపత్రాన్ని ప్రచురించడంలో వుద్దేశం.

ఈ కరపత్రం ప్రతులను "ప్రచురణల శాఖ మేనేజరు, సివిల్ లైన్సు, ఢిల్లీ-8." అనే చిరునామాకు వ్రాసి, ధరకు, తెప్పించుకోవచ్చును.

సంతాప తీర్మానం

అభ్యంకర్‌నగర్, జనవరి 8

గత ఫిబ్రవరి నెలలో స్వర్గస్థులైన మౌలానా ఆజాద్ మృతికి విషయ నిర్ణయ సంఘం నేడొక తీర్మానంలో సంతాపం ప్రకటించినది. దేశ విభజనకు ముందు కాంగ్రెసుకు అత్యంత సన్నిహితులైన డాక్టర్ ఖాన్ సాహెబ్, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ భగవాన్ దాస్, శ్రీమతి అనసూయాబాయి కాలే, అహమ్మదాబాద్ కార్మిక నాయకుడు శ్రీ సోమనాథ్ దేవ్ గార్ల మృతి పట్ల మరొక తీర్మానంలో సంతాపం ప్రకటించినది.

మూగూరుబ్లాకు

హైదరాబాద్, జనవరి 9

తూర్పు గోదావరిజిల్లా మూగూరు బ్లాక్ ఎక్స్‌టెన్షన్ బ్లాకుకుజనవరి 7 వ తేదీన శ్రీ రాజారాఘవరాజు ఎర్రమరాజుగారు ప్రారంభోత్సవం చేశారు. వ్యవసాయ, ప్రదర్శనాన్ని భద్రాచలంలోని అసిస్టెంటు ఏజెంటు శ్రీ సూర్యనారాయణగారు ప్రారంభించారు.

బొంబాయి, జనవరి 9

ఈనెల 11 వ తేదీనుంచి 23 వ తేదీ వరకు సిడ్నీలో జరుగనున్న ప్రపంచ వ్యవహారాలసంస్థ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనటానికిగాను ప్రముఖ ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ అశోక మెహతా నేడువిమానంలో బైల్దేరి సిడ్నీ వెళ్ళారు.

ఒటావా, జనవరి 8

సూత్నక్యూబన్ ప్రభుత్వాన్ని కెనడా గుర్తించినట్టు నేడు ప్రకటించబడినది.

హెచ్చరిక

వెంకటప్పయ్యగారి కుమారుడు కీ॥శే॥బచిమంచి సీతారామయ్యభార్య అయిన పద్మావతమ్మ ఖమ్మం పట్టణంలో ఆమె యాజమాన్యంలో ఉన్న నెంబర్ 3-6/78-79 ఇల్లును అమ్మనున్నట్టు మాకు తెలియవచ్చినది. వారసులు శ్రీ వెంకటప్పారావు (వయస్సు 13 సం॥ లు), రామకృష్ణ (వయస్సు 8 సం॥లు) అనే ఇద్దరు మైనర్ వారసుల వ్యవహారాలను చూడటానికే కాని సీతారామయ్య ఆస్తిపాస్తులను అన్యాక్రాంతం చెయ్యటానికి ఆమె కెట్టి హక్కు లేదు.

ఈ దిగువ సంతకం చేసిన మేము, అనగా రామచంద్రయ్య, వెంకటసుబ్బయ్య, సీతారామయ్యగారి సోదరులం తల్లి సంరక్షణలో ఉన్న పై మైనర్లకు మేము గార్డియన్లం.

వారి గార్డియన్లుగా మేము వారి ఆస్తిపాస్తులను కాపాడవలసి ఉన్నది పైన పేర్కొన్న ఆస్తిని కొనవలదని, అలా చేసినట్లయితే అందుకు వారే బాధ్యులౌతారని ఇందు మూలముగా సమస్త జనులను హెచ్చరించడమైనది.

బి. రామచంద్రయ్య,
&
బి. వెంకటసుబ్బయ్య

తేదీ : 9-1-1959
సికింద్రాబాద్

వైద్యపాక్షిక సమావేశం

హైదరాబాద్, జనవరి 9

ప్రతి సంవత్సరం కొరవారి జరిగే వైద్యపాక్షిక సమావేశం యీ పాక్షి ఫిబ్రవరి 9 వ తేదీ ఉ 11 గం. కు సచివాలయంలో కమిటీ రూమ్‌లో జరుగుతుంది. మేనేజిమెంట్లు, కార్మికులు, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రతినిధులు ప్రస్తుతం కార్మిక విధానాలను గురించి చర్చిస్తారు.

బాంగ్‌కాక్, జనవరి 8

అంతర్ ప్రాంతీయ వాణిజ్య అభివృద్ధిని పెంపొందించటానికి గల మార్గాలను గురించి చర్చించటానికి 15 ఏసియా రాజ్యాల నుంచి, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు నేడిక్కడ సమావేశమైనారు.

ఈ సమావేశం బ్యాంకాక్ సమితి ఆసియా, దూరప్రాచ్య ఆర్థిక కమిషన్ అధ్వర్యాన జరుగుతున్నది. ఈ సమావేశం జనవరి 15 వరకు సాగుతుంది.

* * *

న్యూఢిల్లీ, జనవరి 8

ఇండియాలో వారం రోజులు పర్యటించే నిమిత్తం వస్తున్న యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో ఢిల్లీలో రెండు రోజులు ఉంటారు ఆయన జనవరి 15వ తేదీన ప్రధాన మంత్రితో సంభాషణలు జరుపుతారు.

* * *

లండన్, జనవరి 9

ఘనా ప్రధాని డాక్టర్ క్వామే ఎన్‌క్రూమా నేడు ఉదయం విమానంలో న్యూఢిల్లీ నుంచి బైరో చేరుకొన్నట్టు బైరో రేడియో ప్రకటించినది. డాక్టర్ ఎన్‌క్రూమా బైరోలో రెండు రోజులు ఉంటారు.

లాహోర్, జనవరి 8

పాకిస్థాన్ అమెరికా ఇవ్వదలచిన ఆర్థిక సహాయం గురించి అమెరికా విదేశ శాఖ అధికారులతో సంప్రదింపు జరిపే నిమిత్తం పాకిస్థాన్ ఆర్థిక మంత్రి శ్రీ మహమ్మద్ షోయబ్ వచ్చే నెలారంభంలో అమెరికా వెళ్ళనున్నట్టు నేడు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

హైదరాబాదు, జనవరి 9

ధర్మాదాయ, పరిశ్రమల శాఖామాత్యులు శ్రీ ఎ. భగవంతరావుగారు జనవరి 11 వ తేదీన కారులో బైలుదేరి జహీరాబాదు వెడతారు. తిరిగి అదే రోజు రాత్రి 10-30 గంటలకు ఆయన హైదరాబాదు వస్తారు.

టాటాకా జగిత్యాల

డిప్టీ కలెక్టర్ గారి

అభిప్రాయము 20-2 57 వ తేదీ

డాక్టర్ లుబ్మాన్ నేత్ర చికిత్స నివుయినోతో నా కంటి పరీక్ష చేయించి, ఒక కంటిజోడు తీసుకొని వారి ప్రఖ్యాత పనితనమును రుజువు చేసికొని, వెలలో కూడా ఎలాటి మోసం లేదని గ్రహించితిని. వీరి బోరూం "జనతా ఆప్టిక్స్" నిజాంపాహారోడ్ వంటిమంచిచోట. వీరి యేర్పాట్లు బహు బాగుగా నున్నవి. డాక్టర్ గారు, చాలదిరముల నుండి నేత్ర రోగుల సేవచేయుచున్నారు. వీరి ప్రఖ్యాతి దిగదిగనుండి అధిక మగుచున్నది. ఇందుకు వీరి అనుభవము, నైపుణ్యము మరియు కార్యదక్షతలే కారణము.

తేది 20-6-57

నేడేచూడండి ! నేడేచూడండి !!

శరత్ ఫిలిమ్స్ వారి

పులిచేసిన పెళ్లి

రీగల్ అశోక్ రోజ్ హనుమాన్
హైదరాబాద్ నిజామాబాద్ కరీంనగర్ మహబూబ్‌నగర్
అటల సమయాలు : 2-45, 6-00, 9-30
(Cima) —పూర్ణాకిలీజ్—

నేడే చూడండి ! నేడే చూడండి !!

భార్యాభర్తల జీవితాలను ఏకంచేసే "మాంగల్యానికి" ఎటువంటి శక్తి ఉన్నదో చూడండి

అన్నపూర్ణా వారి

మాంగల్యబలం

సావిత్రి, నాగేశ్వరరావు, బేబిశశికళ, సూర్యకాంతం, కన్నాంబ, జి. వరలక్ష్మి, రేలంగి, రంగారావు, రమణమూర్తి, కుటుంబరావు, డాక్టర్ శివరామకృష్ణయ్య, వంగర

నిర్మాత డి. మధుసూధనరావు, బి. ఏ. — దర్శకత్వం ఆదుర్తి సుబ్బారావు

ప్యాలెస్ హైదరాబాద్ — అజంతా సికింద్రాబాద్ — రామా వరంగల్
అటల సమయాలు: 2-30, 6-00, 9-30
(TRUPIX) —నవయుగ రిలీజ్—

విజయవంతమైన